Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 182 Issue No : 182 | సోమవారం Monday | అక్టోబర్ 26, 2026 26 OCTOBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



### తుపాను హెచ్చరికల నేపథ్యంలో
## అప్రమత్తంగా ఉండాలి

**అధికార యంత్రాంగానికి హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు**

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

- తరువాయి 2లో..



### రాష్ట్రానికి అతి తీవ్ర
## తుపాను ముప్పు

**బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం**

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి
రాష్ట్రానికి పెను తుపాను ముప్పు పొంచి ఉంది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి అతి తీవ్ర తుపానుగా మారి రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. ఈ తుపాను అక్టోబర్ 28వ తేదీన బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ

2 లో..

### ప్రజలకు ఇబ్బంది
# రాకుండా చూసుకోవాలి

- అర్నాబ్ తుఫాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- సమీక్షకు హాజరైన సిఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ గుప్తా, జిల్లాకలెక్టర్లు, ఆర్టీజీ అధికారులు, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, హోం శాఖ అధికారులు
- పాల్గొన్న హెల్త్, సివిల్ సప్లై, మునిసిపల్, పంచాయతి రాజ్ శాఖ అధికారులు
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుఫానుగా బలపడే అవకాశం
- రాష్ట్రంపై ప్రభావం, ముందస్తు సన్నద్ధతపై ముఖ్యమంత్రి సమీక్ష
- సహాయక చర్యల కోసం రాష్ట్రంలో అందుబాటులోకి 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు
- ప్రమాద ప్రాంతాల్లో తరలింపు, పునరావాస కేంద్రాలు, ఆహారం, తాగునీరు, వైద్యం, విద్యుత్ పునరుద్ధరణ అంశాల్లో సన్నద్ధతపై సిఎం సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:
రాష్ట్రానికి ఆర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లిన అన్ని బోట్లు తీరానికి వచ్చేలా చూడాఅన్నారు.భారీ వర్షాల కారణంగా వచ్చే వరదతో రిజర్వాయర్లు నింపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల--విశాఖపట్నం మధ్య తుఫాను తీరం దాటే అవకాశం ఉండడం వలన ప్రస్తుత అంచనాల్లో కోనసీమ--యానాం--కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఉన్నాయని. విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా సుమారు 850 కిలోమీటర్లు, కాకినాడకు సుమారు 930 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం ఏర్పడి ఉదయానికి తుఫానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుఫానుగా, 27న అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశంతో తీరం దాటే సమయంలో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో గాలులు...కొన్ని సందర్భాల్లో 140 కిలోమీటర్ల వరకు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు





### ఇది ఒక
## తీర్థయాత్ర లాంటిది

- **12 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ (ప్రజాభూమి ప్రతినిధి)
12 ఏళ్లు పూర్తి చేసుకున్న 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం ఈ ప్రయాణం ఒక తీర్థయాత్ర లాంటిదని అభివర్ణించిన మోదీ సామాన్యుల అసాధారణ కృషిని దేశం ముందుంచే గొప్ప అవకాశమని వెల్లడి శ్రోతలు చూపిన ఆత్మీయత, అనురాగం తనకు అమూల్యమైన ఆస్తి అని కుటుంబ సభ్యుడిలా దేశ ప్రజలతో కనెక్ట్ అయ్యే అవకాశం లభించిందని ప్రధాని మోడీ అన్నారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని ఆయన అభివర్ణించారు. నేడు ప్రసారమైన 139వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి, స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
"పన్నెండేళ్ల క్రితం, విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించాం.
అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా

- మిగతా 2లో..

## వేడెక్కిన మచిలీపట్నం

- 60 డివిజన్లలో ముమ్మరమైన కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం
- పోటాపోటీగా ప్రచార సరళి

మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి)
మచిలీపట్నం నగరపాలక సంస్థలో 60 డివిజన్లలో ఎన్నికల ప్రచారం ఊపందుకొంది. కూటమి, వైఎస్సార్‌సీపీ, కొన్ని ప్రాంతాల్లో ఇండిపెండెంట్లు సైతం ఆయా డివిజన్లలో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. కూటమి పార్టీ కార్పొరేషన్ మేయర్ స్థానంతోపాటు 60 డివిజన్లలో గట్టి పోటీ ఇస్తోంది. వైఎస్సార్‌సీపీ కూడా 'తగ్గేదేలే' అంటూ పోటీకి 'సై' అంటూ ముందడుగులు వేస్తోంది. ఒక్కొక్క డివిజన్‌లో కార్పొరేటర్ అభ్యర్థికి 17 లక్షలు పైచిలుకు ఖర్చు అవుతుందని ప్రచారం జరుగుతోంది. ప్రతీ రోజూ ప్రచార నిమిత్తం ఒక్కొక్క అభ్యర్థి వెనుకా కనీసం 30 నుంచి 40 మందికి పైగా తరలి వెళుతున్నారు. వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీలకు పోటీలో ఉన్న అభ్యర్థులే ఖర్చు చేస్తున్నారు.



2 లో..



### ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు
## పొడిగింపు పరిశీలిస్తాం

- ఎన్‌ఎంసీ

2 లో

### అమ్మవారి సన్నిధికి
## పోటెత్తిన భక్త జనం

- అందరికీ ఉచిత దర్శన సదుపాయం కలుగజేసిన ఆలయ ఈవో శీనా నాయక్
- ఈవో ఆదేశాల మేరకు భక్తులందరికీ అన్నప్రసాదాలు ప్రత్యేక సదుపాయాలు

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం వేకువజాము నుండి భవానీ దీక్షాధారులు, సామాన్య భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దీక్షా విరమణల నిమిత్తం సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన వేలాది మంది భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి క్షేత్రమంతా అరుణవర్ణ శోభితమై, 'జై భవానీ' నామస్మరణతో మార్మోగింది.
?ఉదయం నుండే అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గ నగర్ వైపు నుండి భక్తులు పోటెత్తడంతో కొండమీద క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి.

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## ప్రజా సంక్షేమమే పాలనకు గీటురాయి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే పాలకులను ఎన్నుకుంటారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలు, అవసరాలను నెరవేర్చాలనే విశ్వాసంతో ప్రభుత్వాలకు అధికారాన్ని అప్పగిస్తారు. అందువల్ల ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా నిలుస్తాయి. అయితే కాలం మారుతున్న కొద్దీ అభివృద్ధి నిర్వచనం కూడా మారుతోంది. భారీ భవనాలు, విస్తృతమైన రహదారులు, పారిశ్రామిక ప్రాజెక్టులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే అభివృద్ధికి సంపూర్ణ సూచికలు కావు. సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చింది? పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయా? నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించాయా? రైతులకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయా? సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు లభించే సమాధానాలే నిజమైన అభివృద్ధికి కొలమానాలుగా నిలుస్తాయి.

**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలి**

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు అనేక హామీలను ప్రజల ముందుంచుతాయి. సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన, రైతుల అభ్యున్నతి, మహిళల సాధికారత వంటి అంశాలు ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా వినిపిస్తాయి. ప్రజలు కూడా తమ భవిష్యత్తుపై ఆశలతో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల అనంతరం ఆ హామీలను ఎంతవరకు అమలు చేశారనే అంశాన్ని సమీక్షించుకోవడం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం.

ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకూడదు. వాటి అమలుకు స్పష్టమైన కార్యాచరణ, తగిన నిధులు, సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరం. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా చేరాలి. అర్హత ఉన్నప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు తగ్గాలి. ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించినప్పుడే ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుంది.

**రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది**

భారతదేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో వ్యవసాయ రంగానికి విశిష్టమైన స్థానం ఉంది. కోట్లాది కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే రైతన్న అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాడు. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, కరువు పరిస్థితులు, పెరుగుతున్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయి. పంట చేతికి వచ్చిన తరువాత సరైన ధర లభించకపోవడం కూడా రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు సాగునీటి సౌకర్యాలు, నాణ్యమైన విత్తనాలు, అందుబాటులో ఎరువులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత కల్పించాలి. పంటల కొనుగోలులో పారదర్శకత పాటిస్తూ గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం సకాలంలో అందించాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఆర్థిక భరోసా కల్పించడం సమాజం, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత.

**నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలి**

దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలో ఉంది. విద్యావంతులైన యువత తమ ప్రతిభను నిరూపించుకోవడానికి తగిన అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. డిగ్రీలు, సాంకేతిక విద్యను పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాలు లభించకపోవడం అనేక కుటుంబాల్లో ఆందోళనకు కారణమవుతోంది. నిరుద్యోగం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు; అది దేశ ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే సామాజిక సమస్య కూడా.

ఈ సమస్య పరిష్కారానికి పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి, వృత్తివిద్య విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలి. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కూడా పెంపొందించాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించి స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉపాధి కల్పించే కార్యక్రమాలను విస్తరించాలి. యువతలోని సృజనాత్మకతకు తగిన ప్రోత్సాహం లభించినప్పుడే వారి శక్తి దేశ అభివృద్ధికి ఉపయోగపడుతుంది.

**విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి అందాలి**

విద్య మనిషి జీవితాన్ని మార్చగల శక్తివంతమైన సాధనం. ఒక కుటుంబంలో విద్యకు ప్రాధాన్యత పెరిగితే ఆ కుటుంబ భవిష్యత్తు మెరుగుపడే అవకాశాలు పెరుగుతాయి. పేదరికం కారణంగా ఏ చిన్నారి విద్యకు దూరం కాకూడదు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, తగిన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు వంటి సదుపాయాలు కల్పించాలి. ఉపాధ్యాయుల కొరతను అధిగమించి విద్యార్థులకు సమర్థవంతమైన బోధన అందేలా చూడాలి. అదేవిధంగా వైద్యం సామాన్య కుటుంబాలకు భారంగా మారకూడదు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు తగ్గాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.

**మహిళా సాధికారతతోనే సమగ్ర ప్రగతి**

ఒక కుటుంబం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర కీలకం. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, నిర్ణయాధికారం వంటి అంశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి. మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వారు ఎలాంటి వివక్షకు గురికాకుండా చూడాలి. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలు చిన్న వ్యాపారాలు, పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన శిక్షణ, ఆర్థిక సహకారం అందించాలి. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగినప్పుడు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా సమాజ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుంది. మహిళలను గౌరవించడం, వారి హక్కులను పరిరక్షించడం, వారి ప్రతిభకు తగిన గుర్తింపు ఇవ్వడం అభివృద్ధి చెందిన సమాజ లక్షణం.

**అవినీతికి అడ్డుకట్ట.. పారదర్శక పాలనకు ప్రాధాన్యత**

ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలు. ప్రజల కోసం కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించబడాలి. అభివృద్ధి పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం వంటి సమస్యలను అరికట్టేందుకు కఠినమైన చర్యలు అవసరం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందాలి.

ప్రజా ధనం ప్రజల సంక్షేమం కోసమే వినియోగించబడాలనే భావన ప్రతి అధికారిలో ఉండాలి. పథకాల అమలులో రాజకీయ పక్షపాతాలకు తావులేకుండా అర్హతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు సకాలంలో స్పందించి పరిష్కారాలు చూపాలి. పాలనలో పారదర్శకత పెరిగినప్పుడే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు తమ బాధ్యతలను కూడా గుర్తించాలి.

# ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు పొడిగింపు పరిశీలిస్తాం

- **మిగిలిన ఎన్నారై కోటా 112 సీట్ల భర్తీకి మరో 15 రోజులు గడువు పొడిగించాలని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ రాసిన లేఖపై స్పందించిన ఎన్ఎంసీ**

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి**

ప్రస్తుత 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు పొడిగింపు, నీట్ యూజీ అర్హత శాతం తగ్గింపు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిశీలిస్తామని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్ అనంతరం 112 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా మిగలడంతో, ప్రవేశాల గడువును మరో 15 రోజులు పొడిగించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ప్రభుత్వ సూచనల మేరకు ఎన్ఎంసీని కోరింది. ఈ విషయమై విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎన్ఎంసీ ఛైర్‌పర్సన్‌కు, కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (వైద్య విద్య)కు లేఖ రాశారు. 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల ప్రక్రియను అక్టోబరు 26లోగా పూర్తి చేయాల్సి ఉంది. విశ్వవిద్యాలయం మొదటి, రెండో, మూడో విడత (మాప్-అప్) కౌన్సెలింగ్‌తో పాటు స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్‌ను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించింది. అక్టోబరు 23న స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్ పూర్తయినా 112 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా మిగిలాయి. ఈ సీట్లను భర్తీ చేసేందుకు నీట్ యూజీ--2026 అర్హత శాతాన్ని తగ్గించాలని, కౌన్సెలింగ్, ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసేందుకు చివరి తేదీని మరో 15 రోజులు పొడిగించాలని విశ్వవిద్యాలయం ఎన్ఎంసీకి విజ్ఞప్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి కూడా ఎంబీబీఎస్ ప్రవేశాల గడువును నవంబరు 20, 2026 వరకు పొడిగించాలని కోరిన విషయాన్ని విశ్వవిద్యాలయం తన లేఖలో ప్రస్తావించింది. అక్టోబరు 26న ప్రవేశాల గడువు ముగిసిన తర్వాత లేఖపై పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎన్ఎంసీ వెల్లడించింది. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల 9,పద్మావతి మెడికల్ కళాశాలలో 8 చొప్పున ఎన్నారై సీట్లు మిగిలాయి. ఇదే కేటగిరిలో మిగిలిన 95 సీట్లు ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయి.

# వేడెక్కిన మచిలీపట్నం



(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రచారం ఈ నెల 26వ తేదీ సాయంత్రం వరకూ ముమ్మరంగా కొనసాగుతుంది. ఇవి కాక అభ్యర్థి వెనుక ప్రచారానికి వచ్చేవారికి ఏరోజుకారోజు రూ.500 రొక్కం అందజేస్తున్నారని తెలుస్తోంది. ఈ ఎన్నికల వేళ కార్యకర్తలకు అభ్యర్థి వెనుక తిరిగే వారికి పండగే అని చెప్పవచ్చు. ఆయా పార్టీల అభ్యర్థుల అనుచరులు జెండాలు చేతబట్టి జేజేలు కొడుతూ అన్ని డివిజన్లలోనూ దద్దరిల్లజేస్తున్నారు. ఇదిలా ఉంటే కార్పొరేషన్ మేయర్ అభ్యర్థికి ఈ ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. మేయర్ అభ్యర్థి జీపుకి పెట్రోలు, అనుచరుల ద్విచక్ర వాహనాలకు పెట్రోలు, వారి దినసరి ఖర్చులు అన్నీ తడిసిమోపెడవుతాయని చెప్పక తప్పదు. మేయర్ అభ్యర్థులకు వైఎస్సార్‌సీపీ అయినా, కూటమి అయినా ఎన్నికల ప్రచారానికి కనీసం 5 నుంచి 6 కోట్లు ఖర్చు అవుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కొన్ని డివిజన్లను ప్రతిష్టాత్మంకగా తీసుకున్న వారికి ఎన్నికల ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉంది. నగరంలో ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు మేయర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమతమ డివిజన్లలోనూ ముమ్మర ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు వారి వారి డివిజన్లను అభివృద్ధి చేస్తామని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, మంచినీటి వసతిని పెంపుదల చేసి ప్రజలకు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన తాగునీరు ప్రతిరోజూ క్రమం తప్పక అందిస్తామని, డివిజన్లలో లైటింగ్ వ్యవస్థను మెరుగుపరుస్తామని, అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నారు.

ఈసారి మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్పొరేషన్ 60 డివిజన్లుగా అవతరించింది. నిన్నటి వరకూ 50 డివిజన్లుగా ఉన్న నగర పాలక సంస్థ కార్పొరేషన్ 60 డివిజన్లుగా విస్తరించడం శుభపరిణామం. త్వరలో బందరు పోర్టు రూపాంతరం చెంది నగర అభివృద్ధి పరిధి మరింత విస్తరించే అవకాశం ఉంది. దీనికితోడు కొత్త కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే నగర జనాభా కూడా పెరుగుతుంది. కాబట్టి ఈ కార్పొరేషన్ ఎన్నికలు పోటీ చేసే అభ్యర్థులకు అత్యంత కీలకం కానున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధికి అంకితమయ్యే కార్పొరేటర్లకు, మేయర్‌కు నగర ప్రజలు పట్టంకడతారు. ఈసారి మేయర్ ఎన్నిక ప్రత్యక్ష ఎన్నిక కానుంది. మరి ఆయా డివిజన్లలో కార్పొరేటర్లుగా, ప్రత్యక్ష పద్ధతిలో మేయర్‌గా గెలుపు గుర్రం ఎక్కే ఆ ధీరులు ఎవ్వరో..?.

# అమ్మవారి సన్నిధికి పోటెత్తిన భక్త జనం

- **అందరికీ ఉచిత దర్శన సదుపాయం కలుగజేసిన ఆలయ ఈవో శీనా నాయక్**
- **ఈవో ఆదేశాల మేరకు భక్తులందరికీ అన్నప్రసాదాలు ప్రత్యేక సదుపాయాలు**

**ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి**

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం వేకువజాము నుండి భవానీ దీక్షాధారులు, సామాన్య భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దీక్షా విరమణల నిమిత్తం సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన వేలాది మంది భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి క్షేత్రమంతా అరుణవర్ణ శోభితమై, 'జై భవానీ' నామస్మరణతో మార్మోగింది.

?ఉదయం నుండే అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గ నగర్ వైపు నుండి భక్తులు పోటెత్తడంతో కొండమీద క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని సామాన్య భక్తులకు, భవానీలకు సత్వర దర్శనం కల్పించేందుకు దేవస్థాన యంత్రాంగం కీలక నిర్ణయాలు తీసుకుంది.

?భక్తుల రద్దీ నియంత్రణలో భాగంగా ఉదయం నుండే శ్రీ అమ్మవారి అంతరాలయ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ అమ్మవారికి మహానివేదన సమర్పించిన తర్వాత, సాధారణ భక్తుల దర్శనానికి మరింత వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో అన్ని రకాల ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను సైతం రద్దు చేసి, క్యూలైన్లలో ఉన్న భక్తులందరికీ పూర్తిగా ఉచిత దర్శనం (సర్వదర్శనం) మాత్రమే అమలు చేస్తున్నారు.

క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా తాగునీరు పంపిణీని అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. భక్తులందరూ దేవస్థాన సిబ్బంది, భద్రతా సిబ్బందికి సహకరించి క్రమశిక్షణతో శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనం చేసుకోవాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారివి.కె. శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

# తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం బాపట్ల--విశాఖపట్నం తీరాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని, అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు**

తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి సూచించారు. బీచ్‌లలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ఇతర ప్రమాదకర కార్యకలాపాలకు పాల్పడటం వంటివి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వదంతులను నమ్మొద్దు.. అధికారిక హెచ్చరికలను పాటించాలి**

తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు, ప్రజలు తమ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) జారీ చేసే అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రానికి అతి తీవ్ర తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఐఎండీ ఆదివారం ఉదయం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఈ వాయుగుండం ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 880 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 980 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది క్రమంగా బలపడుతూ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈరోజు సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా, అక్టోబర్ 26న తుపానుగా, 27న తీవ్ర తుపానుగా, 28 నాటికి అతి తీవ్ర తుపానుగా మారనుందని ఐఎండీ తెలిపింది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం ఇది తీరాన్ని దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తుపాను సన్నద్ధతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని, అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

# ఇది ఒక తీర్థయాత్ర లాంటిది

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతోంది. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉంది. దేశ ప్రజల కృషిని దగ్గర నుంచి అర్థం చేసుకోవడానికి, వారి సేవలకు వందనం చేయడానికి 'మన్ కీ బాత్' నాకు ఒక తీర్థయాత్ర కన్నా తక్కువేమీ కాదు. సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారు " అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని వివరించారు. ఈ 12 ఏళ్లలో, సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. "ఈ కార్యక్రమం ద్వారా నేను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నాను. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించింది" అని తెలిపారు.

# ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబర్ 27 ఉదయం నుంచే తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత ఉండే అవకాశం, అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్రలోని ఇతర ప్రాంతాలపై గాలులు, వర్షాల ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 27, 28 తేదీల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందిని ఉత్తరాంధ్ర, మధ్య కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ. నమోదయ్యే అవకాశం ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ., విశాఖపట్నంలో 253.87 మి.మీ., శ్రీకాకుళంలో 249.18 మి.మీ. వర్షపాతం అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు మొత్తం వర్షపాతం 95 మి.మీ.గా అంచనా గా అధికారులు చెబుతున్నారని ప్రభావిత జిల్లాల్లో సగటున 22--29 సెం.మీ వర్షపాతం అవకాశం,సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉంటుంది....మత్స్యాకారులు వేటకు వెళ్ల వద్దని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.అలాగే రైతులు,ఇతర వ్యవసాయ,వాణిజ్య ,రవాణా,విద్యుత్ వైద్యంతో పాటు ప్రజలకు ఏ ఆపద రాకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

### పోలవరం జిల్లాలో 43 పోలింగ్ కేంద్రాల్లో

# మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగింపు

- జిల్లా యంత్రాంగం ప్రతిపాదన మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలులి
- భద్రతా కారణాలతో ఏడు మండలాల్లో పోలింగ్ సమయం కుదింపు
- ఓటర్లు నిర్ణీత సమయానికి ముందే ఓటు హక్కు వినియోగించుకోవాలి: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం**

పోలవరం జిల్లాలో నవంబర్ 3, 2026న నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సమయానికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుందనీ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం చేసిన ప్రతిపాదన మేరకు, భద్రతా కారణాల దృష్ట్యా చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఏడు మండలాల్లో గుర్తించిన 43 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగింపు సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు మారుస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో యథావిధిగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సంబంధిత పోలింగ్ కేంద్రాలన్నీ వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఈ) ప్రభావిత ప్రాంతాల్లో ఉండటంతో పాటు, దట్టమైన అటవీ ప్రాంతాలు, కష్టతరమైన కొండ ప్రాంతాలు, పరిమిత రహదారి అనుసంధానం, ప్రమాదకరమైన రవాణా మార్గాలు ఉన్న నేపథ్యంలో భద్రతాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని జిల్లా యంత్రాంగం కోరిందన్నారు. ఈ ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని కుదిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. నవంబర్ 3న జరిగే పోలింగ్‌తో పాటు, అవసరమైతే నవంబర్ 4న నిర్వహించే రీపోలింగ్‌కు కూడా ఈ సమయ మార్పు వర్తిస్తుందనీ తెలియ చేయడం జరిగింది

**పోలవరం జిల్లాలో మొత్తం: 7 మండలాల్లో 43 పోలింగ్ కేంద్రాలు**

**మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగిసే కేంద్రాల వివరాలు**

1. వై. రామవరం మండలం: పోలింగ్ కేంద్రాలు 1, 2, 8 – మొత్తం 3 కేంద్రాలు.
2. గుర్తేడు మండలం: పోలింగ్ కేంద్రాలు 1, 2, 3, 4, 5, 10, 11 మొత్తం 7 కేంద్రాలు.
3. మారేడుమిల్లి మండలం: పోలింగ్ కేంద్రాలు 1, 2, 8, 11 మొత్తం 4 కేంద్రాలు.
4. దేవీపట్నం మండలం: పోలింగ్ కేంద్రం 26 --- మొత్తం 1 కేంద్రం.
5. రాజవొమ్మంగి మండలం: పోలింగ్ కేంద్రాలు 3, 4, 6, 7, 14, 17, 24 --- మొత్తం 7 కేంద్రాలు.
6. రంపచోడవరం మండలం: పోలింగ్ కేంద్రాలు 1, 2, 3, 4 --- మొత్తం 4 కేంద్రాలు.
7. చింతూరు మండలం: పోలింగ్ కేంద్రాలు 1, 2, 3, 4, 5, 6, 7, 8, 10, 14, 15, 18, 19, 20, 21, 22, 23 --- మొత్తం 17 కేంద్రాలు.

జిల్లా యంత్రాంగం చేసిన ప్రతిపాదన మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా, సంబంధిత మండలాల్లో ఓటర్లకు పోలింగ్ సమయ మార్పుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులకు సూచించారు. మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగిసే 43 కేంద్రాలకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును మధ్యాహ్నం 3 గంటలలోపు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయవచ్చని స్పష్టం చేశారు. ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రం, పోలింగ్ ముగింపు సమయాన్ని ముందుగానే తెలుసుకొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై ఓటు హక్కును వినియోగించుకోవా లని కలెక్టర్ కోరారు.



## ఎన్నికల కోడ్ అమలులో విస్తృత తనిఖీలు

- నెల్లిపూడి అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసుల నిఘా

**ప్రజా భూమి ప్రతినిధి గంగవరం**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పోలవరం జిల్లా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసు సిబ్బంది,ఎన్నికల అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తూ అప్రమత్తంగా వ్యవహరించారు ఎన్నికల సమయంలో అక్రమంగా నగదు,మద్యం,ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉపయోగించే ఇతర వస్తువుల రవాణాను అరికట్టే లక్ష్యంతో అధికారులు తనిఖీలు చేపట్టారు వాహనాల రాకపోకలను పరిశీలిస్తూ ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బందితో పాటు వెలుగు సిబ్బంది, ఏపియం అప్పలకొండ,సచివాలయ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా,పారదర్శకంగా సాగేందుకు వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని,తనిఖీల సమయంలో అధికారులకు సహకరించాలని సూచించారు.

### మానవత ఆధ్వర్యంలో

## రూ.6,500 ఆర్థిక సహాయం



**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**

తాళ్లపూడి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమీక్ష సమావేశం ఆదివారం తాళ్లపూడి శిరిడి సాయిబాబా మందిర ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఈ నెలలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, నైతిక కార్యక్రమాలపై సమీక్షించి వివరించారు. అనంతరం గజ్జరం గ్రామానికి చెందిన ఇనపాల సూర్యచంద్రం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా పక్షవాతానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సంస్థ తరపున రూ.6,000, వెంకటరమణ మాస్టారు రూ.500 కలిపి మొత్తం రూ.6,500 ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పోసే రావు, కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి హనుమంతరావు, ఉపాధ్యక్షులు రాజశేఖర్, ఈసీ సభ్యులు రామచంద్రరావు, వెంకటర మణ, విశిష్ట సభ్యులు సూర్యనారాయణ, ఆంజనేయులు మాస్టారు, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, వెంకటరమణ మాస్టారు తదితర మానవత మిత్రులు, సభ్యులు పాల్గొన్నారు.

### బంగారమ్మ తల్లికి పూజలు చేసి

## వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం ప్రారంభం



**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**

మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన వైసీపీ అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ–1 అభ్యర్థి మేని గణేష్, ఎంపీటీసీ–2 అభ్యర్థి కొత్తపల్లి సునీత ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. పెద్దలు పోసిన శ్రీకృష్ణదేవ రాయలు ఆదేశాల మేరకు బంగారమ్మ తల్లి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ విభాగానికి చెందిన పిట్ట శ్రీనివాస్, వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ మేని శేషగిరి, ఎలిపే రాజు, ఊటాల నంద, నూతంగి సురేష్, మేని చిన్నా, నల్లమిల్లి విజయ్ జగన్, లింగంపల్లి వీరబాబు, అయినపర్తి రత్నబాబు, మాంద్రు చిన్నా, గంగరాజు పాల్గొన్నారు.

### తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో

## యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ:**

ఆర్నాబ్ తుఫాన్ హెచ్చరిక లు నేపథ్యంలో కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి. ఎస్ మల్లిబాబు తహసీల్దార్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల తో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 28వ తేదీ నాటికి తుఫాను తీవ్ర రూపం దాల్చి కాకినాడ వద్ద తీరం దాటవచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ పంచాయతీ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో ప్రజానీకాన్ని ఎప్పటికప్పుడు చేయాలని ముఖ్యంగా తీర ప్రాంతం మండలాలైన ఉప్పాడ, కొత్తపల్లి. కాకినాడ రూరల్.

కాకినాడ అర్బన్ మరియు కరప తాళ్ళరేవు మండలాల్లో సిబ్బంది కంట్రోల్ రూమ్ ఓపెన్ చేసి నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యంగా ఈదురు గాలులకు చెట్లు విరిగిన నేపథ్యంలో అవసరమైన రంపం మిషన్లు అగ్నిమాపక సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచడమైనదని. ముఖ్యంగా త్రాగునీరు ఆసుపత్రులు మొబైల్ టవర్లకు అవసరమైన చమురు నిలవలు సిద్ధం చేసుకోవాలని, మండలాల్లో గల ప్రభుత్వ స్కూళ్లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం. త్రాగునీరు విద్యుత్ సౌకర్యాలకు ఆటంకం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు ఎటువంటి విపత్కర పరిస్థితి నైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

### ప్రత్తిపాడులో ఎంపీపీ అభ్యర్థి

## యాళ్ళ జగదీష్ దంపతుల ప్రత్యేక ప్రచారం






- క్రైస్తవ చర్చిల సందర్శన.. ఫాస్టర్ల ఆశీస్సులు, ప్రత్యేక ప్రార్థనలు

**ప్రజా భూమి,ప్రత్తిపాడు, కాకినాడ జిల్లా:**

ప్రత్తిపాడు ఎంపీపీ అభ్యర్థి యాళ్ళ జగదీష్ తన సతీమణి మంగాదేవితో కలిసి ఆదివారం ప్రత్యేక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడులోని పలు క్రైస్తవ చర్చిలను సందర్శించి, చర్చి ఫాస్టర్ల ఆశీస్సులు తీసుకున్నారు. దంపతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలకు చేరుకున్న యాళ్ళ జగదీష్, మంగాదేవి దంపతులకు క్రైస్తవ సంఘ పెద్దలు, విశ్వాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దంపతులు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చర్చిల అభివృద్ధికి, క్రైస్తవ సంఘాల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ సంఘ పెద్దలు దంపతుల కోసం ప్రార్థనలు చేసి తమ ఆశీస్సులు అందించారు. చర్చిల వద్దకు కూటమి నాయకులు, అభిమానులు తరలిరావడంతో సందడి నెలకొంది.

ఈ ప్రచార కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ములు కన్నబాబు, వెలుగుల నాని, అంబటి బుజ్జి, శేలంకూరి భాను, మొరా సత్యనారాయణ వరప్రసాద్, శెట్టి బత్తుల వీరబాబు, ముత్యాల రాంబాబు, రావూరు తాతాజీ, మెలిపాక నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఏలేశ్వరంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా

## ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ఇంటింటి ప్రచారం

- 16, 17 వార్డుల్లో ప్రజలను కలిసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా.. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి



**ప్రజాభూమి, ప్రత్తిపాడు (ఏలేశ్వరం), కాకినాడ జిల్లా:**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం నగర పంచాయతీలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 16, 17 వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఆమె స్వయంగా ప్రజలను కలుసుకుని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి యార్లగడ్డ అక్షిత, 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వాగు రాజేష్, 17వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అలమండ మధుతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ఆయా వార్డుల్లోని ఇళ్లకు వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడిన ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయా వార్డుల్లో కూటమి అభ్యర్థుల తరఫున ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

## పోలవరం జిల్లాలో కూటమి టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి!

- 12 మండలాల జనసేన నాయకుల్లో ఆవేదన గంగవరం జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు వెల్లడి



**ప్రజా భూమి ప్రతినిధి గంగవరం**

పోలవరం జిల్లాలో కూటమి పార్టీల మధ్య టికెట్ల కేటాయింపు అంశం రాజకీయ చర్చకు దారితీస్తోందని గంగవరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కుంజం సిద్దు తెలిపారు నియోజకవర్గ పరిధిలోని 12 మండలాలకు చెందిన జనసేన నాయకులు టికెట్ల కేటాయింపు విషయంలో అసంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు కూటమి పార్టీల మధ్య సమన్వయం నాయకులకు తగిన ప్రాధాన్యత స్థానికంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం వంటి అంశాలపై అధిష్ఠానం దృష్టి సారించాలని జనసేన నాయకులు కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న నాయకులు కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని టికెట్ల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు కూటమిలోని పార్టీల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలంటే నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## జీలుగుమిల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు మృతి

- జాతీయ రహదారిపై రెండు మోటార్ సైకిళ్లు ఢీ





**ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మసీదు సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వేగంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో టి. నర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ధారావతు భద్రం (60), బుట్టాయిగూడెం మండలం జోడేబోడె గూడెం గ్రామానికి చెందిన సింధూర్ (33) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఇద్దరూ మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ' ఫేస్బుక్ మిత్రుల పెద్ద మనసు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు ఫోక్స్' ఫేస్బుక్ మిత్రుల బృందానికి, ఒకప్పుడు పాలకొల్లు పట్టణంలో నివసించి, ప్రస్తుతం తణుకులో స్థిరపడిన ఒక పేద స్వర్ణకార కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాల గురించి తెలిసింది. సబిత అనే మహిళ-ఆమె భర్త మరణించడంతో-తన పుట్టింట్లో ఉంటూ, తన సోదరుల సహాయంతో ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. దురదృష్టవశాత్తూ, కొద్ది నెలల వ్యవధిలోనే ఆమె సోదరులిద్దరూ (వెదురుపర్తి సురేష్, వీరాచార్యులు) అనారోగ్యంతో (మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలతో) కన్నుమూశారు. దీంతో, కుటుంబాన్ని పోషించే బాధ్యత, పిల్లలను పెంచి చదివించే భారం పూర్తిగా ఆ తల్లిపైనే పడ్డాయి. ప్రస్తుతం ఆమె ఒక టైలరింగ్ షాపులో రోజువారీ వేతనంతో పనిచేస్తున్నారు. 'పాలకొల్లు ఫోక్స్' బృంద సభ్యులు ఎప్పుడూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో ముందుంటారని మనందరికీ తెలుసు, గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు కూడా దీనిని నిరూపించాయి. సబిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పాలకొల్లు ఫోక్స్ సభ్యులు పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి భవిష్యత్తు సురక్షితం కావడమే కాకుండా, ఆ తల్లి జీవనోపాధికి కూడా ఎంతో మేలు జరుగుతుందని భావించారు. పాలకొల్లు ఫాక్స్ ఫేస్బుక్ గ్రూప్ తరపున సబిత గారి కుటుంబానికి 37500/- ఆర్థికసాయం అందజేయడం జరిగింది. సుమారుగా 7500 మంది సభ్యులున్న పాలకొల్లు ఫోక్స్ ఫేస్బుక్ గ్రూపుకి అడ్మిన్‌గా కొమ్ముల సురేష్, మోడరేటర్‌గా వింజరపు కిషోర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పట్నాల కిషోర్ కుమార్, కేవీఎస్ ఎల్ నర్సింహారాజు, కాద శ్రీను, బాలారెడ్డయ్య, చక్రధర్,రాజేంద్ర ప్రసాద్, నాని తదితరులు పాల్గొన్నారు

### ఆర్నబ్ తుఫాను ముప్పు నేపథ్యంలో

# జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు
- ఉధృతంగా గాలులు వీచే అవకాశమున్నందున ముందు జాగ్రత్తలు
- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (91549 70454) ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

"ఆర్నబ్" తుఫాను ప్రభావంతో జిల్లాలో పెనుగాలులతో పాటు భారీ వర్షాల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు సహాయక, రక్షణ చర్యలను ముమ్మరం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, పౌరసరఫరాలు, వైద్య, జలవనరులు తదితర శాఖల జిల్లా అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రోడ్ల పక్కన ఉన్న భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. హోర్డింగ్‌ల ఫ్రేమ్‌లపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించి ఖాళీగా ఉంచాలని, జోన్ల వారీగా తొలగింపు నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, పాత భవనాలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారిని ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన పునరావాస కేంద్రాలుగా విద్యాసంస్థల భవనాలు, ఫంక్షన్ హాళ్లను సిద్ధం చేయాలని సూచించారు. తుఫాను ప్రభావిత పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్సులను వికేంద్రీకరించి అన్ని డివిజన్లు, మండలాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సామాగ్రిని అవసరమైన ప్రదేశాల్లో ముందుగా డంప్ చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తిరువూరు, విస్సన్నపేట, జగ్గయ్యపేట ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు.

**మండల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధం:**

ప్రతి మండల కేంద్రంలో రోడ్ల క్లియరెన్స్, విద్యుత్ పునరుద్ధరణ, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో అత్యవసర స్పందన బృందాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈదురుగాలుల కారణంగా చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన సందర్భాల్లో గరిష్టంగా అరగంటలో రహదారులను క్లియర్ చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని తాగునీటి ప్లాంట్ల వద్ద తగినన్ని డీజిల్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అవసరమైన అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

**ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

జిల్లాలో తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను యాక్టివేట్ చేసినట్లు తెలిపారు. మండల స్థాయి స్పందన బృందాల వివరాలు, సహాయక నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సహాయం అవసరమైనప్పుడు స్థానిక వార్డు లేదా గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని, అలాగే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454 కు సమాచారం అందించాలని కోరారు. తుఫాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### ఏలేశ్వరంలో పలు చర్చిల్లో

# ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రత్యేక ప్రార్థనలు

- నగర పంచాయతీ అభివృద్ధి, అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రార్థనలు

ప్రజాభూమి, ప్రత్తిపాడు (ఏలేశ్వరం)
కాకినాడ జిల్లా



ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం నగర పంచాయతీలో ఆదివారం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని ప్రార్థనలు చేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి యార్లగడ్డ అక్షితతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులందరూ ఎన్నికల్లో విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజల ఆశీర్వాదంతో అభ్యర్థులు విజ యం సాధించి, ఏలేశ్వరం నగర పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పట్టణ అభివృద్ధికి కృషి చేసే అవకా శం అభ్యర్థులకు లభించాలని ఆకాంక్షించారు.

ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ప్రజలతో మమేకమవుతూ తమ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ మద్దతు కోరడంతో పాటు, దైవ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి అభ్యర్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



అర్నబ్ తుపాను అతి తీవ్ర తుపానుగా మారి రాష్ట్రంలోని 12 జిల్లాలపై ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తుపానుగా మారిన తర్వాత 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం రాత్రికి వాయుగుండంగా బలపడింది. ఇది విశాఖకు 820 కి.మీ., కాకినాడకు 910 కి.మీ., మచిలీపట్నానికి 1,020 కి.మీ.. బాపట్లకు 1,100 కి.మీ.. దూరంలో కేంద్రీకృతమైంది. తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారనున్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం ఉదయానికి తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. మంగళవారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం కనిపిస్తోంది. తర్వాత పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ అతి తీవ్ర తుపానుగా మారొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీర సమీపానికి చేరుకొని బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం కనిపిస్తోంది. ఆ సమయంలో పెనుగాలులు వీచే అవకాశం ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తుపాను ప్రభావంతో ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అతి భారీ వర్షాలు, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 29 నాటికి తుపాను తీవ్రత కాస్త తగ్గనుంది. ఆ రోజు ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియపరిచారు.



### అన్నవరం సత్యనారాయణ స్వామి వారిని

# దర్శించుకున్న హోంమంత్రి అనిత

- రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, ప్రత్తిపాడు (అన్నవరం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నవరంలోని శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో హోంమంత్రి అనిత ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆమె ఆలయంలో కొద్దిసేపు గడిపారు.

# వీరిశెట్టిగూడెంలో గ్యాస్ సిలిండర్ పేలుడు

- ప్రమాద బాధిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆర్థిక సహాయం

ప్రజాభూమి ప్రతినిధి, కామవరపుకోట

కామవరపుకోట మండలం, వీరిశెట్టిగూడెం గ్రామంలోని కాలనీలో ఈరోజు ఉదయం 10 గంటల సమయంలో పిల్లి లక్ష్మి ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే విషయం. విషయం తెలుసుకున్న వీరిశెట్టిగూడెం గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితురాలి ఇంటిని సందర్శించి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి, తమ వంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి భారతాల సుజాత కిషోర్, గుర్రాల రవికుమార్, పెనుమాల సంజీవరావు, గుర్రాల జీవన్ కుమార్, పెనుమాల వేణుబాబు, భారతాల ప్రసాద్ కలిసి బాధిత కుటుంబానికి ఒక బియ్యం బస్తా, కూరగాయలు, 3,000 నగదు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, బాధిత కుటుంబా లకు భరోసా కల్పించడం మనందరి బాధ్యత. కష్టకాలంలో మానవత్వంతో స్పందించి, బాధిత కుటుంబానికి సహాయం అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సేవాభావం అభినందనీయం.

### లక్షలు వెచ్చించినా తప్పని తిప్పలు

# మినీ బస్టాండ్‌లోకి రాని ఆర్టీసీ బస్సులు

**రోడ్లపైనే ప్రయాణికుల నిరీక్షణ, ట్రాఫిక్ సమస్యలు**




ప్రజా భూమి ప్రతినిధి చింతలపూడి

ప్రజాధనం వెచ్చించి ఎంతో ఆర్భాటంగా అభివృద్ధి చేసిన చింతలపూడి పాత బస్టాండ్ (మినీ బస్టాండ్) నేడు నిరుపయోగంగా మారుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం, పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించిన ఈ మినీ బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులను నడపడంలో అధికారులు, సిబ్బంది తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

**రోడ్డుపైనే ప్రయాణం...ప్రయాణికులకు అవస్థలు**

పాత బస్టాండ్ ప్రాంతంలో లక్షలాది రూపాయల ప్రజాధనంతో మినీ బస్టాండ్‌ను తీర్చిదిద్ది, అందుబాటులోకి తీసుకొచ్చారు,అయితే కొందరు ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ప్రాంగణం లోపలికి తీసుకురాకుండా ప్రధాన రహదారిపైనే నిలిపివేసి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోవడమే కాకుండా, ఎండనక వాననక రోడ్డు పక్కనే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపయోగంగా మారిన ప్రజాధనం ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం నిధులు వెచ్చించినా, అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోతే ఇంత ఖర్చు చేసి నిర్మించడం ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి ఈ సమస్యపై స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే), ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని చింతలపూడి ప్రజలు కోరుతున్నారు. మినీ బస్టాండ్‌లోకి ప్రతి ఆర్టీసీ బస్సు తప్పనిసరిగా వచ్చేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుని ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు

# పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఉన్న కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు అనగా డిసెంబర్, 3వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ (మీ కోసం) ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, ప్రజలు తమ ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారంను 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు

# చింతలపూడిలో నూతన కోర్టు భవనం ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

చింతలపూడిలో నూతన కోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీకె. ప్రతాప్ శివ కిషోర్, అనంతరం చింతలపూడి సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. చింతలపూడి లో నూతన కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం వేడుకకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. జయసూర్య,, జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె. శ్రీనివాసరెడ్డిని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చింతలపూడి సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ ఎ సమీక్ష కోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ చింతలపూడి సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రానున్న జడ్పీటీసి, ఎంపీటీసి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చింతలపూడి మరియు లింగపాలెం మండలాల్లోని భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చింతలపూడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ. ఈ సందర్భంగా అధికారులకు ఎస్పీ చేసిన ముఖ్య సూచనలు మరియు ఆదేశాలు ఓటర్లు ఎవరి ఒత్తిళ్లకు లోను కాకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా తగిన వాతావరణం కల్పించాలి. దీనికోసం క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి,పోలింగ్ కేంద్రాలలో నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే విషయంలో ఇతర శాఖల అధికారులతో ఎప్పుడూ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని, ఓటర్లు పోలింగ్ కేంద్రాలలోనికి ప్రవేశించడానికి తిరిగి వెళ్లడానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా, క్రమపద్ధతిలో క్యూలైన్లు పాటించేలా అధికారులు ముందస్తుగా పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీతో పాటు ఏలూరు జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, చింతలపూడి ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్, చింతలపూడి ఎస్సై సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతిరోజూ నడుద్దాం..
# ఆరోగ్యంగా జీవిద్దాం : మంత్రి నిమ్మల





- పాలకొల్లులో వేలాదిమందితో 3కే, 5కే, 10కే రన్
- రన్నర్స్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా పరుగులు.. పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు

**ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు**

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలికి నడకను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ రన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఏడాది పొడవునా ప్రతిరోజూ నడకకు సమయం కేటాయించాలని సూచించారు. పాలకొల్లులో ఆదివారం తెల్లవారుజామున రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే, 5కే, 10కే రన్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యువత, వృద్ధులు, మహిళలు, చిన్నారులు సహా వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చి ఉత్సాహంగా పరుగులు తీశారు. ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడాస్ఫూర్తిని చాటింది. వివిధ వయసుల వారు ఉత్సాహంగా పాల్గొనడంతో పాలకొల్లులో తెల్లవారుజామున సందడి నెలకొంది.

**నడకతో ఆరోగ్యానికి మేలు**

మారుతున్న జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో నడక, వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలని మంత్రి సూచించారు. క్రమం తప్పకుండా నడవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి వ్యాధుల ముప్పును తగ్గించుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. నడకతో శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. ఆరోగ్యం కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, రోజువారీ జీవితంలో నడకకు కొంత సమయం కేటాయించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని సందేశమిచ్చారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తమ వయసు, శారీరక సామర్థ్యానికి అనుగుణంగా నడక, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయన్నారు. రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతిరోజూ నడకను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉల్లాసంగా గడుపుదాం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేలా సాగింది. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్ వర్మ మెరన్స్ ఎండి సిహెచ్ వెంకటేశ్వర వర్మ, టెన్ కె రన్ ఆర్గనైజర్ వేణు, డాక్టర్ కెఎస్పిఎన్ వర్మ,, సంధ్య మెరైన్స్ మేనేజర్ యతిరాజు, కే వాసు తదితరులు పాల్గొన్నారు.

## పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోట్ల నిర్వహణ నిలిపివేత

- సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్

**ప్రజా భూమి ప్రతినిధి కూనవరం..**



రాష్ట్రంలోఆర్నబ్ తుఫాను ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో, గోదావరి నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోట్ల నిర్వహణను అక్టోబరు 26వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిలిపివేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ చిట్టపులి నరేంద్ర పడాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాతావరణ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంతో పాటు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ ముందస్తు చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఇన్‌ల్యాండ్ వెసెల్స్ చట్టం, 1917కు అనుగుణంగా రూపొందించిన నిబంధనలను అనుసరించి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. బోటు నిర్వాహకులు, యజమానులు, సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద ఎలాంటి బోటింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

## తాళ్లపూడి ఎంపీపీ ఎంపికలో అనూహ్య మలుపు

### నాగ శంకర రాణికి కూటమి అవకాశం!

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని తాళ్లపూడి మండల ఎంపీపీ అభ్యర్థిగా తాడిపూడి గ్రామానికి చెందిన నామా కొండబాబు భార్య నాగ శంకర రాణి పేరును కూటమి నాయకత్వం ఖరారు చేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఎంపీపీ అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. తాళ్లపూడి మండల ఎంపీపీ పదవిని జనరల్ కేటగిరీకి కేటాయించడంతో కూటమి పార్టీల్లో ఆశావహుల పేర్లు తెరపైకి వచ్చాయి. అన్నదేవరపేట, గజ్జరం, తాళ్లపూడి, పెద్దేవం గ్రామాలకు చెందిన ఎంపీటీసీ స్థానాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేశారు. తొలుత టీడీపీ నుంచి నామన పరమేశ్వరరావు, కోటారు వెంకట్రావు పేర్లు ప్రచారంలోకి రాగా, జనసేన నుంచి కలూరి సుబ్రహ్మణ్యం పేరు తెరపైకి వచ్చింది. అయితే, అనూహ్యంగా జనరల్ మహిళా కేటగిరీకి కేటాయించిన ఎంపీటీసీ స్థానాలను కూడా ఎంపీపీ అభ్యర్థి ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నారు. మండలంలో సామాజిక సమీకరణాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని దృష్టిలో ఉంచుకుని తాడిపూడి జనరల్ మహిళా ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేస్తున్న నాగ శంకర రాణి పేరును ఖరారు చేస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. దీంతో తాళ్లపూడి మండల ఎంపీపీ అభ్యర్థి ఎంపికపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. కూటమి నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఎన్నికల కోడ్ అమలుతో పీజీఆర్ఎస్‌కు తాత్కాలికంగా రద్దు

- డిసెంబరు 2 వరకు లేదా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిలిపివేత
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్

**ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున పోలవరం జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని డిసెంబరు 2, 2026 వరకు లేదా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు, ఏది ముందుగా జరిగితే అప్పటివరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ, ఎన్నికల సిబ్బంది విధులు, భద్రతా ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత ఆదేశాల మేరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# ఆర్నబ్ తుఫాన్ ఎదుర్కొనేందుకు
# రైతులకు కార్యాచరణ ప్రకటన

**ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం**

తుఫాన్ తీవ్రత అధికంగా ఉండే పరిస్థితులు నెలకొనడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీని ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వేగవంతమైన చర్యలను చేపట్టింది ఇందులో భాగంగా ఉద్యానవన శాఖ రాష్ట్రంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రైతులు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు అనంతరం చేపట్టవలసిన చర్యలపై కార్యాచరణ ప్రకటించింది.

**తుఫానుకు ముందు తీసుకోవాల్సిన చర్యలు**

1. **ఉత్తర కోస్తా జిల్లాలు :** శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం మరియు పోలవరం జిల్లాల్లో తీవ్ర అల్పపీడనం కారణంగా పంటలకు సంభవించే నష్టాన్ని నివారించేందుకు రైతులు కూరగాయల పంటలను ముందుగానే కోత కోయాలని సూచించాలి.

2. **గోదావరి జిల్లాలు :** తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి మరియు ఏలూరు జిల్లాల్లో ప్రధానంగా అరటి పంట దెబ్బతినే అవకాశం ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలను ముందుగానే కోయాలి. సాధ్యమైనంత వరకు కూరగాయల పంటలను కూడా కోత కోయాలి. గాలులకు అరటి చెట్లు పడిపోకుండా నిలువుగా ఉన్న అరటి మొక్కలకు తగిన ఆధారాలు ఏర్పాటు చేయాలి.

3. **కృష్ణా జోన్ జిల్లాలు :** ఎన్‌టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం మరియు బాపట్ల జిల్లాల్లో కూరగాయలు, అరటి మరియు మిరప పంటలు ప్రధానంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలను, కూరగాయల పంటలను ముందుగానే కోయాలి. మిరప పంటలో నీరు నిల్వ ఉండకుండా తగిన మురుగునీటి పారుదల సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.

**తుఫాను సమయంలో తీసుకోవాల్సిన చర్యలు**

తీవ్ర అల్పపీడనం ఉన్న సమయంలో ఉద్యాన రైతులు విద్యుత్ మోటార్లను ఆపివేసి, బోర్‌వెల్స్ మరియు నీటి పంపులకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి. రైతుల భద్రత దృష్ట్యా తీవ్ర అల్పపీడనం ఉన్న సమయంలో పొలాల్లో ఉండకూడదని కచ్చితంగా సూచించాలి. ఉద్యానవన క్షేత్రాల్లో ఫామ్‌హౌస్‌లు, షెడ్లు ఉండే అవకాశం ఉన్నందున ఈ సూచన పాటించాలి.

**తుఫాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలు**

**ప్రచార కార్యక్రమాలు, క్షేత్ర సందర్శనలు మరియు పంటలపై సూచనలు**

ప్రభావిత ప్రాంతాల్లో పంటలను కాపాడేందుకు శాస్త్రవేత్తలు సూచించిన పంటల వారీ శాస్త్రీయ పద్ధతులను రైతులు అనుసరించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభావిత ప్రాంతాల్లో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్ర సందర్శనలు నిర్వహించాలి. పంట నష్టాన్ని అంచనా వేయడానికి బృందాలను ఏర్పాటు చేయాలి. ప్రాథమిక పంట నష్టం నివేదికలను 24 గంటల్లో సమర్పించాలి. రైతుల వారీగా పంట నష్టం వివరాల జాబితాలను ఒక వారంలో సమర్పించాలి.

**ప్రధాన ఉద్యానవన పంటలపై తుఫాను ప్రభావాలు**

1. అరటి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటం. బలమైన గాలుల వల్ల అరటి మొక్కలు పడిపోవడం. చెట్లపై ఉన్న అరటి గెలలు దెబ్బతినడం. సాధ్యమైన చోట ముందస్తుగా కోత కోయడం.

2. కొబ్బరి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటం. వేర్లు దెబ్బతినడం. బలమైన గాలుల వల్ల చెట్లు పడిపోవడం లేదా వేర్లతో సహా పెకలించుకుపోవడం.ఎక్కువ కాలం వర్షాలు కురవడం వల్ల తెగుళ్లు వ్యాపించడం.

3. కూరగాయల పంటలు పొలాల్లో నీరు నిలిచిపోవడం. వేర్లు లేదా మొక్కలు కుళ్లిపోవడం. పోషక పదార్థాలు నష్టపోవడం. చీడపీడలు మరియు తెగుళ్లు పెరగడం. దిగుబడి తగ్గిపోవడం.

4. మిరప పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగునీటి పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. అధిక వర్షాల వల్ల వేర్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. తేమ అధికంగా ఉన్నప్పుడు తెగుళ్లు, చీడపీడలు పెరిగే అవకాశం ఉంది. పంటలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

5. జీడిమామిడి పంట బలమైన గాలుల వల్ల చిన్న మొక్కలు లేదా కొత్తగా నాటిన మొక్కలు పడిపోకుండా అవసరమైన ఆధారాలు ఏర్పాటు చేయాలి.

తోటల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగునీటి పారుదల సౌకర్యాలు మెరుగుపరచాలి. తుఫాను అనంతరం విరిగిన కొమ్మలు, పడిపోయిన మొక్కలు మరియు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి తగిన సంరక్షణ చర్యలు తీసుకోవాలి. వాలుగా ఉన్న భూముల్లో నేల కోత, మట్టి కొట్టుకుపోవడం తగ్గించేందుకు తగిన చర్యలు చేపట్టాలి.

6. కర్రపెండలం / టాపియోకా పంట పొలాల్లో నీరు ఎక్కువసేపు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా నీటిని బయటకు పంపాలి. భారీ వర్షాల వల్ల నేల కోతకు గురికాకుండా, ముఖ్యంగా వాలుగా ఉన్న భూముల్లో తగిన నీటి పారుదల చర్యలు చేపట్టాలి. తుఫాను అనంతరం మొక్కలు వంగిపోయాయా, నేల నుంచి బయటకు లాగబడ్డాయా లేదా కాండాలు దెబ్బతిన్నాయా అని పరిశీలించాలి. నీరు నిల్వ ఉండటం వల్ల వేర్లు కుళ్లే లక్షణాలు కనిపిస్తే, ఉద్యాన అధికారుల సలహా మేరకు తగిన చర్యలు తీసుకోవాలి. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో నమోదు చేసి, ప్రభావిత రైతుల వివరాలతో నివేదిక సిద్ధం చేయాలి.



## దసరా నవరాత్రుల సందర్భంగా
# అమ్మవారి ఊరేగింపు

**ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు**

దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవ సందర్భంగా ఆదివారం పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో (అమృత లింగంపేట) లో గల గంగానమ్మ తల్లి దేవస్థానంలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి దసరా నవరాత్రుల ప్రారంభం నుంచి ఆదివారం వరకు ప్రతిరోజు అమ్మవారు వివిధ రకాల అలంకరణలతో దర్శనమిచ్చారు. ప్రతిరోజు భక్తులు అమ్మవారి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు రాత్రి గ్రామస్తులుచే భజన కాలక్షేపం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గ్రామంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా తేలప్రోలు, వసంతవాడ కళాకారుల బృందంచే కోలాటం నిర్వహించారు.భక్తులందరూ పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాన్ని తిలకించారు. రాత్రి వరకు గ్రామంలో అమ్మవారి ఊరేగింపు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ అమ్మవారికి మంగళ నిరాజనాల సమర్పించారు. ఊరేగింపు అనంతరం కృష్ణ కాలువలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## ఆహార ప్రియులకు
# సరస్ రుచుల విందు..

- ఆదివారం కావడంతో కిటకిటలాడిన ప్రాంగణం
- వివిధ రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీ మహిళల ఉత్పత్తులకు ప్రోత్సాహం

**ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ**

విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా ప్రాంగణంలోని లైవ్ ఫుడ్ కోర్టు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ఆహార ప్రియులు వివిధ రకాల సంప్రదాయ వంటకాలను ఆస్వాదించారు. రుచికరమైన ఆహార పదార్థాలు, విభిన్న ప్రాంతాల వంటకాలతో లైవ్ ఫుడ్ కోర్టు సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లైవ్ ఫుడ్ కోర్టులో ఏర్పాటు చేసిన 50 ఆహార విక్రయ కేంద్రాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ప్రత్యేక వంటకాలను అందిస్తున్నారు. ఆయా రాష్ట్రాల సంప్రదాయ రుచులు, స్థానిక ప్రత్యేకతలతో కూడిన ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అక్కడికక్కడే వంటకాలను తయారు చేసి అందిస్తుండటంతో ఆహార ప్రియులు ఎంతో ఆసక్తిగా వాటిని ఆస్వాదిస్తున్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు సరస్ మేళా వేదిక:**

సరస్ మేళా లైవ్ ఫుడ్ కోర్టు స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఆహార ఉత్పత్తు



లను ప్రజలకు పరిచయం చేసుకునేందుకు, విక్రయాలను పెంచుకునేందుకు మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. విస్తృతమైన వినియోగదారుల ఆదరణతో మహిళా సంఘాలకు ఆదాయం పెరగడంతో పాటు, వారి వంటకాలకు గుర్తింపు లభిస్తోంది. మహిళల నైపుణ్యానికి, స్వయం ఉపాధికి, ఆర్థిక స్వావలంబనకు సరస్ మేళా ఒక మంచి వేదికగా నిలుస్తోంది. రుచుల వైవిధ్యాన్ని ఆస్వాదించే అవకాశం కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్‌ను అందిస్తున్న సరస్ మేళా లైవ్ ఫుడ్ కోర్టు సందర్శకుల ఆదరణతో ప్రత్యేక సందడిని సంతరించుకుందని ఎన్ఐఆర్‌డీపీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ చిరంజీలాల్ కతారియా పేర్కొన్నారు.

## ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలనివైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజ్ఞప్తి



**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న జెడ్పీటీసీ అభ్యర్థి తులి మల్లి పావన జ్యోతి సుజన కుమారి, ఆగిరిపల్లి ఎంపీటీసీ--2 అభ్యర్థి చిమట అంజలిదేవికి తమ ఓటు వేసి గెలిపించాలని ఆగిరిపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సా దం గోపీనాథ్, నక్కన బోయిన శ్రీమన్నారాయణ, కంబాల ప్రదీప్ ఓట ర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆగిరిపల్లి గ్రా మంలోని బ్రాహ్మణ బజార్, కొండ కాలనీ, జంగాలపేట, యాదవుల బజార్ ప్రాంతాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.



## తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ అధికారులకు సీఎండీ పి.పుల్లారెడ్డి ఆదేశం
- కృష్ణా జిల్లాలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి అక్టోబర్ 25**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉండటంతో విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా సిద్ధం చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, కృష్ణా జిల్లా విద్యుత్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు అవసరమైన సిబ్బంది, వాహనాలు, మరమ్మతు పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అన్ని సర్కిల్, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తుఫాన్ ముప్పు దృష్ట్యా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎవరూ సెలవులు తీసుకోవడానికి వీల్లేదని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ప్రమాదాలు, సరఫరా అంతరాయాలపై సమాచారం అందిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కృష్ణా సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ హరిబాబు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**విద్యుత్ సమస్యల సమాచారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు:**

- కృష్ణా సర్కిల్ కార్యాలయం: 6281709355
- ఉయ్యూరు డివిజన్: 7382623231
- మచిలీపట్నం డివిజన్: 9440817572
- గుడివాడ డివిజన్: 9440817573

## తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:**

రాబోయే తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లు (రాజురాజ):

?? 112 । ?? 1070 । ?? 1800 425 0101

**తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు .. పుకార్లను నమ్మవద్దు;**

ప్రశాంతంగా ఉండండి, భయపడవద్దు అని, అత్యవసర సమాచారం కోసం మొబైల్ ఫోన్‌లను ఛార్జ్ చేసి ఉంచుకోండి. విపత్తుల సంస్థ హెచ్చరిక ఎస్ ఎం ఎస్ లను గమనించాలన్నారు. రేడియో/టీవీ వార్తలు చూడండి, వార్తాపత్రికలు చదవాలన్నారు. విలువైన పత్రాలు, సర్టిఫికెట్లను వాటర్ ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవాలని, అత్యవసర వస్తు సామగ్రిని (ఎమర్జెన్సీ కిట్) ముందే సిద్ధం చేసుకొని ఉంచుకోవాలన్నారు. వరదలు/ఉప్పెన ముప్పు ఉంటే వెంటనే ఎత్తైన, సురక్షితమైన ఆశ్రయ ప్రాంతానికి వెళ్లాలని, కనీసం ఒక వారానికి సరిపడా ఆహారం, తాగునీరు నిల్వ ఉంచుకోవాలని, తలుపులు, కిటికీలను సురక్షితంగా మూసివేసి ఉంచుకోవాలన్నారు. అధికారులు సూచించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. తుపాను సమయంలో (ఇంట్లో ఉంటే): ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి; గ్యాస్ కనెక్షన్లను తొలగించండి. తలుపులు, కిటికీలు మూసి ఉంచండి. ఇల్లు సురక్షితం కాకపోతే ముందే సురక్షిత షెల్టర్‌కు చేరుకోండి. కాచి చల్లార్చిన/క్లోరినేటెడ్ నీరు మాత్రమే తాగండి. భవనం దెబ్బతినే సూచనలు ఉంటే బలమైన టేబుల్ లేదా బెంచ్ కింద మిమ్మల్ని మీరు రక్షించుకోండి.

తుపాను సమయంలో (బయట ఉంటే): దెబ్బతిన్న లేదా పాత భవనాల్లోకి వెళ్లవద్దు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఎప్పుడూ నిలబడవద్దు.

గాలి తగ్గినా తుపాను ముగిసిందని అనుకోవద్దు; అధికారులు 'ఆల్ క్లియర్' ప్రకటించే వరకు వేచి ఉండండి.

తుపాను తరువాత: కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగండి. అధికారిక సమాచారం వచ్చేవరకు షెల్టర్ వదిలి బయటకు/ఇంటికి వెళ్లవద్దు.

తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభాల పట్ల తీవ్ర జాగ్రత్త వహించండి. దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులను ఎలక్ట్రీషియన్ తనిఖీ చేసిన తర్వాతే వాడండి.

మత్స్యకారులు చేయవలసినవి: సముద్రంలోకి వేటకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దు. మొబైల్ ఫోన్లను ఎప్పుడూ ఛార్జ్ చేసి ఉంచుకోండి. అదనపు బ్యాటరీలతో రేడియోను సిద్ధంగా ఉంచుకోండి. పడవలు / తెప్పలను సురక్షితమైన ప్రాంతంలో బలమైన తాడుతో కట్టి ఉంచుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

## ఇండిపెండెంట్‌గా జెడ్‌పిటిసి అభ్యర్థిగా
# పొడియం అప్పారావును గెలిపించుకుంటాం

- 16 పంచాయతీల టీడీపీ శ్రేణుల ఏకగ్రీవ తీర్మానం..
- కోతులగుట్టలో పార్టీ నాయకులు, కార్యకర్తల భారీ సమావేశం
- పార్టీ బీఫామ్ ఇవ్వకపోయినా స్వతంత్రంగా నైనా బరిలో నిలుపుతామని స్పష్టీకరణ
- జడ్పీటిసి స్థానాన్ని ఇతర పార్టీలకు కేటాయిస్తే సహించేది లేదు : కేడర్ హెచ్చరిక

**ప్రజా భూమి ప్రతినిధి కూనవరం..**

మండలంలోని కోతుల గుట్ట గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల భారీ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మండలంలోని 16 పంచాయతీలకు చెందిన గ్రామ శాఖల ప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలతో పాటు సుమారు 150 మందికి పైగా ముఖ్య నాయకులు ఈ సమావేశానికి తరలివచ్చారు. ?ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూనవరం జెడ్పీటీసీ అభ్యర్థిగా పొడియం అప్పారావును బరిలోకి దింపి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని 16 పంచాయతీల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు.



**పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి : స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి**

సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న పొడియం అప్పారావు అభ్యర్థిత్వానికి మండలంలోని అన్ని వర్గాల నుంచి బలమైన మద్దతు ఉందని పేర్కొన్నారు. పొత్తుల పేరిటో లేక ఇతర కారణాలతోనో ఈ స్థానాన్ని వేరే పార్టీలకు కేటాయిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. పార్టీ అధికారికంగా బీఫామ్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అప్పారావును స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో నిలిపి గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని శ్రేణులు ఏకగ్రీవంగా స్పష్టం చేశాయి. మండలంలో పార్టీ ఉనికిని, కేడర్ మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

**హాజరైన ముఖ్య నేతలు**

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, మాజీ మండల అధ్యక్షుడు గడేసుల ప్రేమ్ చందు, ఉపాధ్యక్షులు చెలికాని ఉమ, మడకం చిన్ని, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమక సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు ముప్పెనబోయిన నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కరక సర్వేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు వెళ్ళంకి వెంకన్న, కో-క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్‌కే రసూల్, మండల రైతు సంఘం ఉపాధ్యక్షుడు తుంగల కన్నారావు పాల్గొన్నారు. అలాగే యూనిట్ ఇన్‌చార్జిలు వీరమల్లు సునీల్, దాసరి నాగేశ్వరరావు, బూత్ ఇన్‌చార్జిలు బోడ వెంకటేశ్వర్లు, మడకం రవి, ఎంపీటీసీ అభ్యర్థులు శ్రీమంతుల సతీష్, దన్నూరి శ్రీనివాసరావు, కవులూరి రమణ, సీనియర్ నాయకులు కారం రత్తయ్య, కుర సింగయ్య, బండారు శివయ్యలతో పాటు 16 పంచాయతీల గ్రామ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

మండలంలో ప్రాణప్రదంగా భా వించే తెలుగుదేశం పార్టీని ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపడనీయం. మండలంలో పసుపు జెండాను మరింత ఎత్తుకు ఎగుర వేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణు అంతా కట్టుబడి పని చేస్తాయి వారు తెలియజేశారు.

## మూకుమ్మడి రాజీనామా
# వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు..?

- ఒకే కుటుంబానికి రెండు పర్యాయాలు పదవులు
- నాయకులు ప్రజాప్రతినిధులవుతున్నారు కార్యకర్త కార్యకర్తగానే ఉంటున్నాడు

**ప్రజా భూమి ప్రతినిధి కూనవరం**



మండలంలో పార్టీ మొదలు పెట్టిన కార్డు నుండి నేటి వరకు అనేకమంది పార్టీని వేయడం పార్టీలోకి రావడం అనేది కాకరమైన జరుగుతూనే ఉంది అని ప్రస్తుతం ఉన్న తరుణంలో ఒక పెద్ద పార్టీగా అవతరించి ప్రభుత్వాన్ని స్థాపించి గత ఎన్నికల్లో సతీష్ కనపడ్డ వైసిపి నేడు మండలంలో మూకుమ్మడి రాజీనామాలకు తెరతీసిన వైనం చూస్తూ ఉంటే పార్టీ ఎటువైపు వెళుతుంది అనేది ప్రశ్నార్థకంగా మారి వివరాల్లోకి వెళితే ఒకే కుటుంబంలో గతంలో జెడ్పిటిసి భార్యకు ఇవ్వటం జరిగింది. నేడు మరల భర్తకి జడ్పిటిసి ఇవ్వడాన్ని నిరాకరించిన నాయకులు కార్యకర్తలు మేము పోటీ చేస్తామంటూ నలుగురు కార్యకర్తలు ముందుకు వస్తే ఎమ్మెల్యే మాత్రం మరల ఆ కుటుంబానికే బీఫామ్ ఇవ్వటంతో మనస్థాపానికి గురైన నాయకులు మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మికి ఇక్కడున్న పరిస్థితులను వివరించగా ఆమె మరలా కూర్చొబాబుని జడ్పీటీసీని చేయాలి అని బి ఫాం ఆమెకు ఇవ్వడంతో మిగతావారు మనస్థాపన చెందారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి వారి వద్దకెళ్ళి బుద్ధించే ప్రయత్నం చేశారు అయినా ఫలితం దక్కలేదు ఆమె వెనువెంటనే తిరిగి వెళ్ళిపోయారు ఇక ఏమి చేసేది లేక వైసిపి మండల అధ్యక్షుడు ఆలూరు కోటయ్య సమక్షంలో వారితో సహా కార్యకర్తలు మాజీ ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు మాజీ డైరెక్టర్లు రైతు సంఘం నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు మూకుమ్మడి రాజీనామా చేయటం ప్రశ్నార్థకంగా మారింది అలాగే కార్యకర్తలు నాయకులు చేయటం కూడా పదవులకు పార్టీకి రాజీనామాలను జిల్లా ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మికి వారి పత్రాలను పంపించడం జరిగింది అని వారు తెలియజేశారు.



## అఖండ విజయం తథ్యం కావాలి!

**ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం**

మచిలీపట్నం నార్త్ మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి లంకే ఉషారాణికి గరాలదిబ్బ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు నాని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజల ఆశయాలే మార్గంగా ముందుకు సాగుతున్న లంకే ఉషారాణికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజల ఆదరాభిమానాలతో అఖండ విజయం సాధించి, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం... ప్రజల ఆదరణే విజయానికి అసలైన పునాది! అని, మచిలీపట్నం నార్త్ మండలంలో తెలుగుదేశం పార్టీ విజయపతాకం రెపరెపలాడాలని, లంకే ఉషారాణికి ఘనవిజయం చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు గరాలదిబ్బ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు నాని తెలిపారు.

## మచిలీపట్నంలో ద్విచక్ర వాహన ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

కృష్ణా జిల్లా మచిలీపట్నం నగరంలోని 12వ డివిజన్ విశ్వబ్రాహ్మణ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన వ్యక్తుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగంతో వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని స్థానికులు సూచిస్తున్నారు. రహదారులపై అప్రమత్తంగా ప్రయాణిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని కోరుతున్నారు.



# స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే వన్‌సైడ్ విజయం కావాలి

- రెండేళ్లలో పాలకొల్లు నియోజకవర్గానికి రూ.1,300 కోట్ల నిధులు తీసుకొచ్చాం
- అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు వివరించాలనీ కూటమి శ్రేణులకు మంత్రి నిమ్మల పిలుపు

**ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయం సాధించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని గడపగడపకు తీసుకెళ్లి వివరించాలని సూచించారు. పాలకొల్లులోని తన కార్యాలయం వద్ద ఆదివారం పాలకొల్లు, ఎలమంచిలి మండలాలకు చెందిన కూటమి ముఖ్య నాయకులు, శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ పనితీరును వివరించాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వేసే ప్రతి ఓటు గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మార్గం వేస్తుందని మంత్రి పేర్కొన్నారు. వైసీపీకి ఓటు వేయడం వల్ల నష్టమేనంటూ ప్రజలకు ఆలోచించేలా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా వాస్తవంగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. గత రెండేళ్లలో చేసిన పనులతోపాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలనూ ప్రజలకు తెలియజేయాలన్నారు.



పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు నిమ్మల రామానాయుడు తెలిపారు. గత రెండేళ్లలో నియోజకవర్గానికి సుమారు రూ.1,300 కోట్ల నిధులు తీసుకొచ్చి వివిధ అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ వివిధ మార్గాల్లో నిధులు సమీకరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సిమెంట్ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, పుంత రహదారులు, విద్యుత్ సదుపాయాల కల్పన తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ రహదారులను మెరుగుపరిచామన్నారు. ప్రతి గ్రామంలో చేపట్టిన పనులను గుర్తించి, వాటివల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ ఎఫ్) ద్వారా రూ.19.60 కోట్ల ఆర్థిక సాయం అందేలా కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ తమకు కలిగిన ప్రయోజనాన్ని ఇతరులకు వివరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 7
సోమవారం 26 అక్టోబరు 2026

## నడిమిదొడ్డిలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి పుట్టకాల రామలక్ష్మికి మద్దతుగా జోరుగా ప్రచారం

**నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా పర్యటన.. గెలుపే లక్ష్యంగా ముందడుగు**



ప్రజా భూమి నార్పల

మండలం నడిమిదొడ్డి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పుట్టకాల రామలక్ష్మికి మద్దతుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలిసి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లతో మమేకమవుతున్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుట్టకాల రామలక్ష్మి విజయానికి కృషి చేస్తున్నారు. గ్రామంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి.

## నడిమిదొడ్డిలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి చిగిచెర్ల నాగలక్ష్మికి మద్దతుగా జోరుగా ప్రచారం..

### నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటన



ప్రజా భూమి నార్పల

మండలం నడిమిదొడ్డి గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిగిచెర్ల నాగలక్ష్మికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. నాగలక్ష్మి భర్త చిగిచెర్ల రామయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థి విజయానికి కృషి చేశారు. గ్రామంలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు సాగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుసగాని నాగేశ్వరరావు, బుసగాని బాలయ్య, లక్ష్మణ్ రెడ్డి, కరుణాకరరెడ్డి, మునిరెడ్డి, రామమోహన్, నాగార్జున, రేగటి బ్రదర్స్, జూటూరు బ్రదర్స్, చిగిచెర్ల బ్రదర్స్, మిద్దె బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగానాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నడిమిదొడ్డి గ్రామంలో పార్టీకి మద్దతు కూడగట్టేందుకు నాయకులు కృషి చేస్తున్నారు. ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

## పెద్దమ్మ ఆలయంలో పూజల అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన వైసీపీ అభ్యర్థి స్వాతి లత

**నార్పల మండల వ్యాప్తంగా 16 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం**



ప్రజా భూమి నార్పల

నార్పల 3వ ఎంపీటీసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వాతి లత పూలసనూతల పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతుగా నిలిచారు. మరోవైపు నార్పల మండల వ్యాప్తంగా మొత్తం 16 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఆయా స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ శ్రేణులు ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో నార్పల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది.

# కూటమి తోనే అన్ని వర్గాల సంక్షేమం

### -చైర్మన్ అభ్యర్థికి మద్దతుగా ముద్దిరెడ్డిపల్లిలో ప్రచారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

కూటమి పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన పిఎస్ మంజునాథ్ కు మద్దతుగా పలువురు టిడిపి నాయకులు ముద్దిరెడ్డిపల్లిలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి పార్టీలు అధికారంలో ఉంటేనే వార్డు స్థాయిలో కూడా అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని, ప్రజలందరూ దీన్ని దృష్టిలో ఉంచుకొని చైర్మన్ స్థానానికి పోటీ చేస్తున్న మంజునాథ్ తో పాటు వార్డుల్లో కూటమి పార్టీ తరపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇప్పటికే హిందూపురం పట్టణ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చారని, ఆ నిధులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటే కూటమి పార్టీ అభ్యర్థి మంజునాథను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పామిశెట్టి చంద్రశేఖర్, నరసింహప్ప, బాబా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ముద్దిరెడ్డిపల్లి లోని దేవాలయంలో చైర్మన్ అభ్యర్థి మంజునాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.



# పుర పోరు లో 154 మంది అభ్యర్థులు

### -జాబితా విడుదల చేసిన ఎన్నికల అధికారి మల్లికార్జున -గెలుపోటములపై బేరీజు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జున ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. 52 వార్డులకు సంబంధించి అధికారిక జాబితాలో 154 మంది అభ్యర్థుల పేర్లు నమోదయ్యాయి. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారు. వార్డుల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. 1వ వార్డు: జనసేన నుంచి బి. చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నుంచి ఎం. వెంకటేశులు, 2వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్.ఎన్. నరేష్, స్వతంత్రులుగా నరసింహమూర్తి, కె. గంగాధర్, లక్ష్మణ్ణ, టీడీపీ నుంచి లక్ష్మక్కగారి నాగభూషణ, 3వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి భోజనపు సునీత, టీడీపీ నుంచి సుశీల, 4వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఈ.వి. జంషీర్, టీడీపీ నుంచి ఎస్. మహమ్మద్ అమీన్, 5వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి సి.వి. మహేష్, టీడీపీ నుంచి కె. ప్రసాద్, ఎస్‌డీపీఐ నుంచి ఎస్. ముబారక్, 6వ వార్డు: ఎస్‌డీపీఐ నుంచి ఎస్.ఎం.డి. అజార్, కాంగ్రెస్ నుంచి ఎ. ఖలీల్, టీడీపీ నుంచి షేక్ ఫజులుర్ రెహమాన్, వైఎస్సార్‌సీపీ నుంచి పి.ఎస్. ఆసిఫ్, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సైక్ బాషా, 7వ వార్డు: అందించిన అధికారిక జాబితాలో అభ్యర్థుల పేర్లు నమోదు కాలేదు, 8వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి జెడ్. ఉమర్, ఎస్‌డీపీఐ నుంచి రఫీక్ ఖాన్ కె., టీడీపీ నుంచి ఎస్. వెంకటరమణ, స్వతంత్ర అభ్యర్థిగా కె. లోకేష్, 9వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి హెచ్.ఆర్. నసురుల్లా, టీడీపీ నుంచి ఇర్షాద్ అహ్మద్ ఎస్., కాంగ్రెస్ నుంచి ఎస్. ఇర్ఫాన్ బాషా, ఎస్‌డీపీఐ నుంచి అబ్దుల్ హసీబ్, 10వ వార్డు: టీడీపీ నుంచి ఎన్. బీబీ ఆయిషా, వైఎస్సార్‌సీపీ నుంచి టి. రోషన్ అలీ, స్వతంత్రులుగా నజీర్ అహమ్మద్ హాజీ కె., మహబూబ్ బాషా, 11వ వార్డు: అందించిన అధికారిక జాబితాలో అభ్యర్థుల పేర్లు నమోదు కాలేదు, 12వ వార్డు: టీడీపీ నుంచి ఎన్. రహమతుల్లా, వైఎస్సార్‌సీపీ నుంచి మహమ్మద్ అబ్దుల్ బాబా, స్వతంత్రులుగా షేక్ మల్లిక, షేక్ రహమాన్, ఎస్. అహమదుల్లా, 13వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి కె. స్వర్ణకుమారి, బీజేపీ నుంచి జి. గంగారత్న, బీఎస్పీ నుంచి కె. సిద్ధగంగమ్మ, 14వ వార్డు: టీడీపీ నుంచి కె. లీలావతి, వైఎస్సార్‌సీపీ నుంచి వి. పవిత్ర, స్వతంత్ర అభ్యర్థిగా బి.ఎస్. రూపావాణి, 15వ వార్డు: టీడీపీ నుంచి వి.పి. మంజుల, వైఎస్సార్‌సీపీ నుంచి వి. నాగరాజు, 16వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి బి. పార్వతి, బీజేపీ నుంచి పసుపులేటి లావణ్య, 17వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి కె. నందిని, బీజేపీ నుంచి అంజలి, 18వ వార్డు: టీడీపీ నుంచి నేసె అరుణ, వైఎస్సార్‌సీపీ నుంచి షేక్ ఐషా బాను, కాంగ్రెస్ నుంచి షేక్ రహమత్ బీ, స్వతంత్రులుగా ఎస్. గౌసియా బాను, ఫరీదా బాను, షేక్ షరీఫ్, 19వ వార్డు: వైఎస్సార్ సీపీ నుంచి షేక్ షనాజ్ బేగం, టీడీపీ నుంచి ముబారక్ ఎస్., సీపీఐ నుంచి యాస్మిన్ షేక్, ఎంఐఎం నుంచి షేక్ సల్మా, స్వతంత్ర అభ్యర్థిగా కె. సల్మా బాను, 20వ వార్డు: టీడీపీ నుంచి పి. అమ్జద్ ఖాన్, సీపీఐ నుంచి డి. దాదాపీర్, ఎంఐఎం నుంచి పి. దాదాపీర్, బీఎస్పీ నుంచి ఆర్. హుస్సేన్ ఖాన్, వైఎస్సార్‌సీపీ నుంచి రంగయ్య, స్వతంత్ర అభ్యర్థిగా ఎస్. షమియుల్లా, 21వ వార్డు: సీపీఐ నుంచి షేక్ నబీరా, వైఎస్సార్‌సీపీ నుంచి అతీకా ఖానం, ఎంఐఎం నుంచి ఎస్.క తస్లీమ్, టీడీపీ నుంచి యాస్మిన్ బాను షేక్, 22వ వార్డు: కాంగ్రెస్ నుంచి డి. రుక్సానా, సీపీఐ నుంచి షేక్ షబానా, వైఎస్సార్‌సీపీ నుంచి సుమియా బాను, జనసేన నుంచి ఎస్. రేష్మా బాను, 23వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి షమీమ్, ఎస్‌డీపీఐ నుంచి హస్నా బాను, టీడీపీ నుంచి ఫర్హీన్ తాజ్, 24వ వార్డు: జనసేన నుంచి జె. రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నుంచి వై.పి. రఘు, 25వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎం. కల్పన, టీడీపీ నుంచి ఎం.డి. షేక్ ఇంతియాజ్, స్వతంత్రులుగా వై.ఎం.డి. అజార్, షేక్ హిదాయతుల్లా, అజిత్ మట్టా, 26వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి షేక్ రేష్మా, టీడీపీ నుంచి కె. షబీన్ తాజ్, స్వతంత్ర అభ్యర్థిగా బి.ఎం. సల్మా, 27వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్.ఎన్. వెంకటేష్ బాబు, టీడీపీ నుంచి ఎ.వి. చలపతి, 28వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి హెచ్.ఎస్. చైత్ర, టీడీపీ నుంచి ఆర్. సునీత, 29వ వార్డు: టీడీపీ నుంచి లక్ష్మి రావెల్ల, వైఎస్సార్‌సీపీ నుంచి పి. గంగిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా ఎన్. గణేష్ కుమార్, 30వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్. సునీత, టీడీపీ నుంచి పి. రాధ, స్వతంత్రులుగా ఎ.సి. కంసాల, గంగమ్మ, 31వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి జి.టి. సబితారెడ్డి, జనసేన నుంచి ఆర్. ఉషారాణి, 32వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి కె. పరిమళ, టీడీపీ నుంచి అరుణ జ్యోతి, స్వతంత్ర అభ్యర్థిగా కె.వి. ఆంజనేయులు, 33వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి దీప్తి కె.ఎ., టీడీపీ నుంచి జి. గీత, స్వతంత్ర అభ్యర్థిగా పార్వతి, 34వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి తస్వీరా, కాంగ్రెస్ నుంచి ఆర్. కమ్రున్నిసా బాను, టీడీపీ నుంచి ఎన్. ఫర్జానా బాను, 35వ వార్డు: టీడీపీ నుంచి కె. అనిత, వైఎస్సార్‌సీపీ నుంచి షేక్ ఫర్జానా, 36వ వార్డు: ఎంఐఎం నుంచి కె. సదియా బాను, టీడీపీ నుంచి ఎ. రేష్మా బాను, వైఎస్సార్‌సీపీ నుంచి పి.ఎస్. సబీహా బాను, 37వ వార్డు: కాంగ్రెస్ నుంచి పర్వీన్, టీడీపీ నుంచి ఎన్.ఆర్. షహనా, వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్. ఉఫియా తబసుం, 38వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి అక్కంపల్లి నాగేంద్రకుమార్, టీడీపీ నుంచి ఎన్. నాగేంద్రమ్మ, 39వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి బి. నాగరాజు, బీజేపీ నుంచి ఎన్.సి. ఆదర్శ్ కుమార్, 40వ వార్డు: జనసేన నుంచి మరియమ్మ, వైఎస్సార్‌సీపీ నుంచి జి.ఎన్. ధనలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా కె. ఇందిర, 41వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎం.పి. అనిల్ కుమార్, టీడీపీ నుంచి కె. సతీష్ కుమార్, స్వతంత్రులుగా ఎస్.వి. గోవిందరాజులు, డి. రామాంజినేయులు, 42వ వార్డు: టీడీపీ నుంచి జి. ఆదెమ్మ, వైఎస్సార్‌సీపీ నుంచి ఎం. రుమానా తస్లీమ్, కాంగ్రెస్ నుంచి మహమ్మద్ నసీమా, 43వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి షేక్ ఆయేషా, టీడీపీ నుంచి షేక్ హసీనా బేగం, స్వతంత్ర అభ్యర్థిగా ఎస్. మహమ్మద్ సఫియా, 44వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్. మహమ్మద్ ఆసిఫుల్లా, టీడీపీ నుంచి శేఖర్ గౌడ రామకృష్ణ, కాంగ్రెస్ నుంచి ఎం. ఆరిఫ్, స్వతంత్ర అభ్యర్థిగా ఎస్. మహమ్మద్ అయతుల్లా, 45వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి డి. అపర్ణ, టీడీపీ నుంచి పఠాన్ రుబియా బాను, 46వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఈ. చంద్రకాంత్, టీడీపీ నుంచి యు. చంద్ర మోహన్, స్వతంత్ర అభ్యర్థిగా సి. బాలరాజు, 47వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి ఎం. జయరాములు, జనసేన నుంచి ఎం. శివకుమార్, 48వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి వెంకటరామ నీలూరి, టీడీపీ నుంచి డి. భారతి, 49వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి పి. నరేష్, టీడీపీ నుంచి మంచాల మారుతి, 50వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి కె. మహాలక్ష్మి, టీడీపీ నుంచి ఎస్. అనిల్ కుమార్, 51వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి కె. నాగేంద్ర, టీడీపీ నుంచి ఎం. రూప, 52వ వార్డు: వైఎస్సార్‌సీపీ నుంచి పి. రాధమ్మ, జనసేన నుంచి ఎం. సుజాత బరిలో ఉన్నట్లు తెలిపారు. కాగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ విజయావకాశాలపై అంచనాలు వేసుకుంటూ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వార్డుల వారీగా పోటీదారుల సంఖ్య, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం, ప్రధాన పార్టీల మధ్య పోటీ ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలి

### -చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియాతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

### -వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడించాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపునిచ్చారు. మున్సిపాలిటీపై వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 42వ వార్డు అహ్మద్‌నగర్, 40వ వార్డు పరిధిలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చి ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియాతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు రూమనా తస్లీమ్, ధనలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా దీపిక ఆయా ప్రాంతాల్లోని ప్రజలను, స్థానికులను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే



అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డులో పార్టీని బలోపేతం చేయడంతో పాటు చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియా విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అహ్మద్‌నగర్, సీఅండ్ఐజీ మిషన్ చర్చి ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులు రూమనా తస్లీమ్, ధనలక్ష్మిలకు ప్రజల మద్దతు కూడగట్టేందుకు దీపిక ప్రయత్నించారు. వార్డుల అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజల తరఫున గళం వినిపించే ప్రతినిధులను ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలవాలని, పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని దీపిక పిలుపునిచ్చారు. చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియాతో పాటు స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి వైఎస్సార్‌సీపీకి ఘనవిజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కట్ల భాష, హుమాయూన్, చింటూ తదితరులు పాల్గొని అభ్యర్థుల విజయానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

# మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

### -అన్ని విధాలా మైనార్టీలను ఆదుకుంటాం

### -44వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

### --టీడీపీ అభ్యర్థి శేఖర్‌గౌడ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, 44వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, వార్డు పరిధిలోని ప్రజలందరికీ మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 44వ వార్డులో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ, సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వార్డు సమస్యలను తెలుసుకుంటూ, ప్రజల ఆదరాభిమానాలను కోరారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో హిందూపురం పట్టణంలో ఇప్పటికే రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కొనసాగాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. 44వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మైనార్టీ కుటుంబాల సంక్షేమం, పేద ప్రజల సమస్యల పరిష్కారం, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యాలని వివరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలోనే కాకుండా, గెలిచిన తరువాత కూడా ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. తనను ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శేఖర్‌గౌడ్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హరి, రామకృష్ణప్ప, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు అవకాశం ఇవ్వండి

### -పాండురంగనగర్‌లో ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణ అభివృద్ధితో పాటు వార్డులలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని టీడీపీ చైర్మన్ అభ్యర్థి పిఎస్ మంజునాథ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. పాండురంగనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల్లో తనతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు తమకు అవకాశం కల్పిస్తే వార్డుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఎన్నికల అనంతరం కూడా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో విజయం సాధించి వార్డుల అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి ప్రజల నుంచి మద్దతు కోరుతూ నాయకులు ముందుకు సాగారు. దీనికి తోడు చైర్మన్ అభ్యర్థికి మద్దతుగా ఆయన సతీమణి యుక్త సిఅండ్ఐజి మిషన్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థన అనంతరం కూటమి అభ్యర్థి మంజునాథ్ ను గెలిపించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, జనసేన నాయకులు ఆకుల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 8
సోమవారం 26 అక్టోబరు 2026

## పులివెందులలో ముమ్మరంగా వైకాపా ఇంటింటి ప్రచారం - ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటున్న జనం

### అభివృద్ధి జరిగింది జగన్ హయాంలోనే - మున్సిపల్ పీఠం వైకాపాకే దక్కాలి: వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల పట్టణంలో వైకాపా నాయకుల ఇంటింటి ప్రచారం ముమ్మ రంగా సాగుతోంది. మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మను, మీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డిలు కోరారు. ఆదివారం పట్టణంలోని చిన్నన్న రూములు, నగిరిగుట్ట, తదితర ప్రాంతాలలో వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వేయించి వైకాపా అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పులివెందులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించా లంటే మున్సిపల్ పీఠాన్ని వైకాపా దక్కించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి జరిగింది అంటే అది జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనేనని విమర్శించారు. కూటమి నాయకులు ఎన్నో కుట్రలు పన్నుతున్నారని, వాటిని లెక్కచేయకుండా జరిగే ఎన్నికల్లో తమ ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు. గతంలో వైఎస్ ప్రమీలమ్మ మున్సిపల్ చైర్మన్ గా పనిచేసి పులివెందుల పై పూర్తి పట్టు సాధించారని, మరోసారి ఆమెకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్, కొంగనపల్లి రవి, మాజీ కౌన్సిలర్లు మల్లి, రమణ, స్టేట్ వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీ కొంగనపల్లి విజయ్ కుమార్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి



ప్రజాభూమి,పులివెందుల
పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాధవరం-1లో భక్తిశ్రద్ధలతో భగవద్గీత శ్లోకాల పఠన కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల పఠన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని భగవద్గీత శ్లోకాలను భక్తితో పఠించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా గురువులు సుబ్బరామచంద్ర, రూపాలక్ష్మి, శాంతి మాట్లాడుతూ.. భగవద్గీత కేవలం ఆధ్యాత్మిక గ్రంథం మాత్రమే కాదని, మానవ జీవితానికి సన్మార్గం చూపించే దిశానిర్దేశమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలకు గీతా శ్లోకాలను నేర్పించడం ద్వారా వారిలో క్రమశిక్షణ, వినయం, సహనం, పెద్దల పట్ల గౌరవం పెంపొందుతాయని తెలిపారు. భగవద్గీత బోధనలు పిల్లలకు మంచి-చెడుల మధ్య తేడాను గ్రహించే పరిపక్వతను, అవగాహనను కల్పిస్తాయని వారు వివరించారు.

## టిడిపి కౌన్సిలర్లు అభ్యర్థుల గెలుపే ధ్యేయం

### నగిరిగుట్టలో టిడిపి కౌన్సిలర్ల అభ్యర్థుల గెలుపుకు చక్రం తిప్పిన నల్లగారి భాస్కర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో 30, 35 ,36, 37, నగిరిగుట్ట వార్డులలో ఏకగ్రీవం చేసేందుకు నల్లగారి భాస్కర్ రెడ్డి చక్రం తిప్పాడు. పులివెందుల వైయస్ కంచుకోటలో నగిరిగుట్టలో నాలుగు వార్డులు ఏకగ్రీవంగా చేసి చరిత్ర సృష్టించారు. 30 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఆయన సతీమణి నల్ల గారి అనురాధ పోటీ చేయగా పోటీ చేసిన ఇద్దరు వ్యక్తులను బీటెక్ రవి ఆదేశాలతో భాస్కర్ రెడ్డి తెలివితేటలతో వారిని ఎన్నికల్లో పోటీల్లోనే లేకుండా చేయడం జరిగింది. పులివెందుల లో టిడిపి పార్టీ తరపున నాలుగు ఏకగ్రీవం అవడం చరిత్రలోనే మొదటిసారి, ఇది సువర్ణ అధ్యాయంలో లిఖించే విజయమని ప్రజలు అంటున్నారు. వైయస్ కంచుకోటలో బీటెక్ రవి బాగా వేసి 20 వార్డులు ఏకగ్రీవం చేయడం చర్చనీయాంశంగా మారింది. జరగబోయే ఎన్నికల్లో 20 వార్డులలో ఇంకా ఎన్ని వార్డులు కూటమి గెలుచుకుంటుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఇన్ని వార్డులు ఏకగ్రీవంగారంతో ప్రజలు ఇదే చర్చగా గుసగుసలాడుతున్నారు. పులివెందుల కంచుకోట ను బద్దలు కొట్టేందుకు యువ నాయకుడు మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పులివెందులలో అడుగుపెట్టినప్పటి నుండి అన్ని విజయాలే సాధిస్తూ వస్తున్నాడని చెప్పవచ్చు. మొన్న జరిగిన జడ్పిటిసి ఉప ఎన్నికల్లో తన సతీమణి మా రెడ్డి లతా రెడ్డిని గెలిపించేందుకు చాయ్యకుల కృషి చేశారు. ఇప్పుడు పులివెందులలో చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీత కుమారిని గెలిపించేందుకు, 20 వార్డులలో కౌన్సిలర్లు అభ్యర్థులను ఆయన పులివెందులలో నిరంతరం ప్రచారాలు చేస్తూ వారిని బలపరుస్తూ ముందుకు నడుస్తూ వారిని నడిపిస్తున్నారు. పులివెందులలో ఎన్ని ఏకగ్రీవం కావడానికి గల కారణం ఏమిటి అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ నగిరిగుట్టలో నాలుగు వార్డులు ఏకగ్రీవం కావడం చరిత్ర తిరగరాసినట్లు అయింది.

## అభివృద్దే లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు మద్దతివ్వండి: ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ఏలూరు. కార్పొరేషన్ ఎన్నికల్లో సమర్థులైన కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఏలూరు నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుతో కలిసి 34,35వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేసి, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత రెండున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తీర్పు ఇవ్వాలని మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మీరావలీ, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు, పలువురు కూటమి అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలు స్వచ్ఛందంగా ఓటేస్తే విజయం మాదే - పులివెందులలో మా అభివృద్ధే మమ్మల్ని గెలిపిస్తుంది: వైఎస్ ప్రమీలమ్మ

### ప్రజాస్వామ్య వద్ధతిలో ఎన్నికలు జరిగితే వైకాపా గెలుపు ఖాయం
### కూటమి కుట్రలను తిప్పికొట్టండి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి అని పిలుపు



ప్రజాభూమి, పులివెందుల:
జరగబోయే పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేస్తే గెలుపు తమదేనని, పులివెందులలో తాము చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందని వైకాపా చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తన వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా విలేకరులతో ఆమె మాట్లాడారు. పులివెందులలోని 40 వార్డుల్లో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేస్తే తన గెలుపు ఖాయమన్నారు. కూటమి నాయకులు కుట్రలు పన్ని ఓట్లు వేయకుండా అల్లర్లు సృష్టిస్తే ఎవరూ ఏమీ చేయలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి చైర్మన్ అభ్యర్థిగా తనను, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 40 సంవత్సరాలుగా పులివెందుల ప్రజలకు అనేక సేవలు చేశామని, మళ్లీ అవకాశం ఇస్తే ఇంకా అనేక సేవలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే గెలుపు తమదేనని స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైకాపా స్టేట్ సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీ కొంగనపల్లి విజయ్ కుమార్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పులివెందుల కంచుకోట బద్దలు కొడతాం - మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయం: బీటెక్ రవి

### కూటమి అభ్యర్థుల విజయానికి చంటి కుటుంబం సంపూర్ణ మద్దతు - ఇంటింటా ప్రచారంలో దూసుకెళ్తున్న కూటమి నేతలు



ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి తూగుట్ల గీతా కుమారి, కూటమి కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ క్రమంలో పులివెందుల టీడీపీ కార్యాలయం సమీపంలో ఉన్న చంటి నివాసానికి పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి, అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, నల్లాగారి భాస్కర్ రెడ్డి, కూటమి నాయకులతో కలిసి ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా చంటి కుటుంబ సభ్యులు బీటెక్ రవిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంటి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు సహకారం అందిస్తామని, బీటెక్ రవికి అండగా ఉంటూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బీటెక్ రవికి తెలియజేశారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందింద న్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారిని, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పులివెందుల మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం, టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. పులివెందులలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీటీసీ ఎన్నికల్లో ఫారం-బి తప్పనిసరి

### -రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య



ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఎంపీటీసీ అభ్యర్థులు అందరూ తప్పనిసరిగా 'ఫారం-బి'ని సమర్పించాలని రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య స్పష్టం చేశారు. స్థానిక మండల కేంద్రమైన సిద్ధవటంలోని ఎంపీడీవో సభా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 32 నామినేషన్లను పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు (ఉపసంహరణ) ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఆర్వో ఫణి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ వైపు పులివెందుల ప్రజలు - 12వ వార్డులో వైకాపాకు భారీ షాక్: బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల మున్సిపాలిటీలోని ఇస్లాంపురం 12వ వార్డులో వైకాపాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ వార్డులో బలమైన నాయకుడిగా, అనేక కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు ఉన్న అన్వర్ బాషా తో పాటు 30 కుటుంబాలు పెను గొండ చిన్న తరుణ్ (ఆర్ 15 చిన్న), తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా పులివెందుల అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లా డుతూ, పులివెందుల మున్సిపల్ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ముస్లిం కుటుంబాల్లో ఎక్కువ మంది పిల్లలు చదువు కుంటున్న నేపథ్యంలో, గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా ఒక కుటుంబంలో ఒక్కరికే సాయం ఇచ్చేదని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు టీడీపీ అభ్యర్థి అక్రమ్ ను గెలిపించే బాధ్యత తీసుకుంటున్నట్లు అన్వర్ బాషా ప్రకటించారని తెలిపారు. పులివెందుల మున్సిపాలిటీలో ఇప్పటికే కూటమి అభ్యర్థులు 20 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, ధ్రువీకరణ పత్రాలు కూడా తీసుకున్నారని చెప్పారు. గత 40 సంవత్సరాలుగా పులివెందులలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు అలాగే ఉన్నాయని, అభివృద్ధి కోసం ప్రజలు కూటమికి ఒక అవకాశం ఇవ్వాలని బీటెక్ రవి కోరారు.

## యల్లనూరు పోలీసులు సుమోటోగా కేసులు నమోదు...



ప్రజా భూమి యల్లనూరు
మండల వ్యాప్తంగా ఎంపీటీసీ అభ్యర్థుల నుంచి అక్టోబర్ 21 నుండి 23 వరకు జరిగిన నామినేషన్లలో భాగంగా చివరి రోజు శుక్రవారం పోలీస్ స్టేషన్ ఎదురుగా జరిగిన ఘర్షణలలో టిడిపి పార్టీ తరపున నలుగురికి గాయాలైనట్లు, వైసీపీ పార్టీ చెందిన ఒకరికి గాయాలు కావడం వల్ల ఇరువురి పైన సుమోటో కేసులు నమోదు చేశామని అదేవిధంగా ఈ ఘటనలో పాల్గొన్న వారిని గుర్తించి వారి కేసులు నమోదు చేస్తామని ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపారు.

## క్రీడా పోటీల్లో చైతన్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ - రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



ప్రజాభూమి, వేంపల్లె
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో కడప మున్సిపల్ స్టేడియం, పులివెందుల స్పోర్ట్స్ కాంప్లెక్స్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో వేంపల్లె శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడపలో నిర్వహించిన అండర్-14 బాస్కెట్బాల్ పోటీల్లో పి. ప్రణీత్, అభినవ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 చెస్ విభాగంలోనూ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పులివెందులలో నిర్వహించిన అండర్-17 ఖో-ఖో పోటీల్లో మేఘనాథ్, తరుణ్ సాయి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్లో 800 మీటర్ల పరుగు పందెంలో బి. మైనావతి ప్రథమ స్థానం సాధించగా, 1500 మీటర్ల విభాగంలో బి. గౌతమ్ రెడ్డి, 400 మీటర్ల విభాగంలో కాశేశ్వర్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా పాఠశాలలో ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల విజయాల పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడా విభాగం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పులివెందులలో ఎన్నికల ప్రచారం

### గీతా కుమారి, మునివర్ధన్ యాదవ్ లను గెలిపించండి మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. పులివెందుల మున్సిపాలిటీ 20వ వార్డులో కూటమి కౌన్సిలర్ అభ్యర్థి మునివర్ధన్ యాదవ్కు మద్దతుగా పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, రామ్ రెడ్డి లు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీత కుమారితో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. పులివెందుల మండల అధ్యక్షుడు వై. నవీన్, కూటమి నాయకులు హరిప్రియ , పిరమ్మ , కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి, భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రజాభూమి,పులివెందుల
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ కె.ఎన్. శ్రీనివాసులు, డాక్టర్ నారాయణ స్వామి లు అన్నారు. పులివెందుల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆదివారం పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ కె.ఎన్. శ్రీనివాసులు, డాక్టర్ నారాయణ స్వామి ముఖ్య అతిథులుగా హాజరై కళాశాల తుది సంవత్సరం విద్యార్థుల తో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఎర్రిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిద్ధవటంలో ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

ప్రజాభూమి,సిద్ధవటం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఎగువపేట పోలీస్ లైన్ క్రాస్ సమీపంలో ఆదివారం సాయంత్రం 5వ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయం కమాండెంట్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ నరసింహులు మాట్లాడుతూ.. దేశ రక్షణలో, ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21 నుండి 30 వరకు ఈ వారోత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం స్థానిక పోలీసులు, పోలీస్ పటాలయం ఆర్ఎస్ఐ నరసింహులు, జి. సుబ్బయ్య మరియు బ్యాండ్ సెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
సోమవారం 26 అక్టోబరు 2026

## నామినేషన్ తిరస్కరించిన జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

జిల్లాలో యాదమరి మండలం జెడ్పిటిసిగా నామినేషన్ వేసిన కే పుష్పావతి నామినేషన్ తిరస్కరించిన జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం స్థానిక జడ్పీ కార్యాలయంలోనే సమావేశ మందిరంలో రెండవ సాధారణ ఎన్నికల- మండల ప్రాదేశికనియోజకవర్గాల( జడ్పిటిసి)2026 నామినేషన్లు తిరస్కరణపై అపీళ్లు సంబంధించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఎనిక్షల షెడూల్ ప్రకారం, 21.10.2026 నుండి 23.10.2026 వరకు నామినేషన్ల సీకరణ జరిగింది మరియు 24.10.2026న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) పూర్తయింది. ఈరోజు పరిశీలనలో తిరస్కరణకు గురైన గ్రాుజ నామినేషన్లకు సంబంధించి, యాదమరి మండలం జెడ్పిటిసిగా నామినేషన్ వేసిన కే పుష్పావతి నామినేషన్ తిరస్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు మేరకు జిల్లాలో 27 మండలాలలో గ్రామీణ ప్రాంతాలలో ఆమె ఓటర్ గా నమోదు కాలేదని కారణంతో ఆమె నామినేషన్ తిరస్కరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జడ్పిఆర్ఓ రవికుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

## బి. శాంతి నామినేషన్ తిరస్కరణపై ఆర్డీఓకు అప్పీల్ - న్యాయం చేయాలని సీపీఐ డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టోన్



మండలంలో ఎంపీటీసీ ఎన్నికల బరిలో నిలిచేందుకు సీపీఐ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బి. శాంతి నామినేషన్‌ను తిరస్కరించడాన్ని నిరసిస్తూ, ఈరోజు ఆర్డీఓ కార్యాలయం లో అప్పీల్ దాఖలు చేసి, ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన సమయంలో రేణిగుంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వ్యవహరించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నామినేషన్ దరఖాస్తుకు సంబంధించిన అసలు పత్రాలను పరిగణనలోకి తీసుకోకుండా బి. శాంతి నామినేషన్‌ను తిరస్కరించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆర్డీఓ సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనల ప్రకారం బి. శాంతి నామినేషన్‌ను ఆమోదించి, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అధికార కూటమి పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించి సీపీఐ అభ్యర్థి బి. శాంతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ రేణిగుంట మండల కార్యదర్శి వైస్ మణి మాట్లాడుతూ, రేణిగుంట మండలంలోని తారకరామా నగర్ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజలకు చేరువగా ఉంటున్న బి. శాంతికి స్థానికంగా ఉన్న ప్రజాభిమానాన్ని చూసి భయపడిన కూటమి నాయకులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆమెను ఎన్నికల పోటీకి దూరం చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఇటువంటి చర్యలు అన్యాయమని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బి. శాంతికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పి.ఎల్. నరసింహులు, రేణిగుంట మండల నాయకులు రజాక్, మహమ్మద్ అలీ, మోహన్ రెడ్డి, శివకుమార్, కోగిలి మునిచందు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాలపురం ఎంపీటీసీ పరిధిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిడుగు రాణి విస్తృత ప్రచారం!

### గ్రామాల్లో ముమ్మరంగా పర్యటనలు.. ప్రజలను కలుస్తూ మద్దతు అభ్యర్థన

ప్రజా భూమి ప్రతినిధి:
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం వేణుగోపాలపురం ఎంపీటీసీ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పిడుగు రాణి (పిడుగు కేశవులు సతీమణి) ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమె గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానికులతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో ప్రజలను కలుసుకుంటూ తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకుంటున్న పిడుగు రాణి, ఎంపీటీసీగా తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ప్రజలతో సన్నిహితంగా మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని మహిళలు, యువత, పెద్దలను కలుసుకుంటూ ఎన్నికల్లో తనకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేణుగోపాలపురం ఎంపీటీసీ పరిధిలో రాజకీయ సందడి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లను కలుసుకుంటూ తమ ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిడుగు రాణి సైతం ప్రజల మధ్యకు వెళ్లి తనకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా ఓటర్లకు చేరువయ్యేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు.

## శ్రీలక్ష్మిగ్రూప్స్ అధినేత కె. ప్రసాద్ కి గౌరవ డాక్టరేట్ ప్రధానం

ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి



శ్రీలక్ష్మి గ్రూప్స్ అధినేత కె. ప్రసాద్‌కి సమాజ సేవా కార్యక్రమాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా శుక్రాచార్య యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పేదలకు, చిన్నారులకు సహాయం అందించడంతో పాటు, శ్రీలక్ష్మి గ్రూప్స్ సంస్థ ద్వారా మెడికల్ క్యాంపులు, పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజ సేవకు తన వంతు కృషి చేస్తున్న కె. ప్రసాద్ సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందజేశారు. తిరుపతిలోని ప్రముఖ హోటల్ పాయ్ వైస్రాయ్‌లో విశ్వ జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ గోపినాథ్ , శ్రీమతి రమ్య మరియు వారి బృందం చేతుల మీదుగా డాక్టరేట్‌ను ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి , ఐ సి ఏ ఎస్ చైర్మన్ శ్జొన్నలగడ్డ శ్రీనివాసరావు గారు, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ పుచ్చ శ్రీనివాసరావు పాలపర్తి శ్రీకాంత్ శర్మ విశ్వ జ్యోతిష్య విజ్ఞాన సంస్థ తెలంగాణ అధ్యక్షులు విశ్వనాథం , ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ చక్రధర సిద్ధాంతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ కె. ప్రసాద్ గారి సేవా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. శ్రీలక్ష్మి గ్రూప్స్‌కు అభినందనలు --- సేవా మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం.

# ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యానికి పాతర! నామినేషన్ల తిరస్కరణపై సీపీఐ, సీపీఎం ధ్వజం

● అధికార పార్టీకి తొత్తులుగా ఎన్నికల అధికారులు ● తప్పు చేసిన అధికారులను కోర్టు ముందు నిలబెడతాం




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ప్రజాక్షేత్రంలో గెలవలేమన్న భయంతోనే కూటమి నేతలు దౌర్జన్యాలకు దిగుతూ ఏకగ్రీవాల కోసం అడ్డదారులు తొక్కుతున్నారని సీపీఐ, జిల్లా కార్యదర్శి పి. మురళీ, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాని నాగరాజు సంయుక్తంగా విమర్శించారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, చిన్నచిన్న లోపాలను సాకుగా చూపి నామినేషన్లు తిరస్కరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలనీ, తిరస్కరించిన నామినేషన్లన్నింటినీ పునఃపరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాళహస్తిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వీరిద్దరూ మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల సంఘం అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని నేతలు ఆరోపించారు. రేణిగుంటలో నాలుగు సీపీఎం అభ్యర్థుల నామినేషన్లను ఆర్వో ఆదినారాయణరెడ్డి, తొట్టంబేడులో నాలుగు సీపీఎం ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లను ఆర్వో గోవిందరాజ భాస్కర్ చిన్నచిన్న లోపాలు చూపుతూ తిరస్కరించడం అధికారుల పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు. రాష్ట్రమంతా కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ నకళ్ళను ఎన్నికల ఆర్వోలు ఆమోదిస్తే తొట్టంబేడులో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించారంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాలరాస్తూ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనల అమలులో అందరికీ ఒకే విధానం ఉండాలని, అధికార పార్టీకి ఒక న్యాయం.. ప్రతిపక్షాలకు మరో న్యాయం చేస్తే ప్రజాస్వామ్యానికి అర్థమేంటని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు చోట్ల ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలకు కారణమయ్యారని విమర్శించారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో గెలవాల్సిన అధికార పార్టీ నేతలు, ప్రత్యర్థులను పోటీ నుంచి తప్పించేందుకు ఒత్తిళ్లు, దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఏకగ్రీవ ఎన్నికలు అభ్యర్థుల స్వచ్ఛంద నిర్ణయంతో జరగాలి తప్ప, బెదిరింపులు, అడ్డంకులతో సాధించేవి కాదన్నారు. ప్రతిపక్షాలకు పోటీ చేసే అవకాశమే లేకుండా చేసి ఏకగ్రీవాలను సాధించడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా దాడులు చేసేందుకు కిరాయి గూండాలను రంగంలోకి దించుతున్నారని నేతలు ఆరోపించారు. వారిలో 18 ఏళ్లు కూడా నిండని యువత ఉండటం మరింత ఆందోళనకరమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను హింసాత్మక ఘటనల్లోకి లాగడం సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అలాంటి అధికారులే పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు రావడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమన్నారు. నామినేషన్ల తిరస్కరణలు, అభ్యర్థులను అడ్డుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని అన్ని అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, ఆధారాలతో సహా న్యాయస్థానాన్ని ఆశ్రయించి బాధ్యులను కోర్టు ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, హరినాథ్, రంగయ్య, రమణయ్య, సత్య, సిపిఐ నాయకులు కత్తి రవి, వైఎస్ మణి, గోపి, మించల శివకుమార్, చారులత, శ్రీనివాసులు

## తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డిని కలిసిన రేణిగుంట మండల కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డిని రేణిగుంట మండలానికి చెందిన కూటమి పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డితో అభ్యర్థులు కాసేపు సమావేశమై, రేణిగుంట మండలంలోని రాజకీయ పరిస్థితులు మరియు గ్రామాల్లో నెలకొన్న స్థానిక పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల కూటమి ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టాలమ్మ, ఎల్లమ్మ పొంగళ్ళు కార్యక్రమంలో పాల్గొన్న కలవగుంట భరత్ రెడ్డి దంపతులు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి రూరల్ మండలం తొండమనాడు గ్రామంలో వెలసి ఉన్న శ్రీపుట్టాలమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల పొంగళ్ళు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు కలవగుంట భరత్ రెడ్డి దంపతులను ఆహ్వానించారు. అనంతరం భరత్ రెడ్డి దంపతులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గురవారెడ్డి, శ్రీనివాస్, శశి, మునిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రావణ్, గోపి, చరణ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం పూల అలంకరణతో కనువిందుగా మారగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

# 26 న తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీ క్రియ యూనివర్శిటీలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహణ

### 65 కు పైగా కుదుర్చుకోనున్న పారిశ్రామిక ఒప్పందాలు - తద్వారా వేలాదిమంది యువతకు ఉపాధి కల్పన

### సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి-జిల్లా కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



31వ సీఐఐ భాగస్వామ్య శిఖరాగ్ర సమావేశాల లో భాగంగా అక్టోబర్ 26 న తిరుపతి లో నిర్వహించనున్న ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 26 న తిరుపతి శ్రీ సిటీ క్రియా యూనివర్సిటీ నందు తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో భాగంగా 65కు పైగా అవగాహన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉండగా, తద్వారా వేలాదిమంది యువతకు ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం కానుందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి పరిశ్రమలు, అంతరిక్ష రంగం, పర్యాటకం, ఆతిథ్యం, ఆటోమొబైల్ విడిభాగాలు, ఫార్మా, సోలార్ ఉత్పత్తులు, లాజిస్టిక్స్, ప్యాకేజింగ్ మరియు రీ సైక్లింగ్, పాదరక్షల తయారీ, తదితర రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించనున్నారన్నారు. అదేవిధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, స్థానిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించడం, బ్యాంకింగ్ సమస్యల పరిష్కారం, ఉత్పత్తుల ప్రదర్శన, ఎగుమతుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారన్నారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సి ఐ ఐ భాగస్వామ్య శిఖరాగ్ర సదస్సుకు సన్నాహకంగా నిర్వహిస్తున్న ఈ ప్రాంతీయ సదస్సు, తిరుపతి ప్రాంతంలో పెట్టుబడుల ఆకర్షణకు, పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడనుంది.

## తిరస్కరించబడిన జడ్పిటిసి నామినేషన్ల పై అప్పీలుకు దరఖాస్తు చేసిన ముగ్గురు అభ్యర్థులు

**జిల్లా జాయింట్ కలెక్టర్ - అదనపు జిల్లా ఎన్నికల అధికారి ఆర్. గోవిందరావు**

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు తిరస్కరించబడిన అభ్యర్థుల్లో ముగ్గురు జెడ్ పి టి సి అభ్యర్థులు అప్పీలు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ ,ఆర్. గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 24వ తేదీ వరకు దాఖలైన జడ్పిటిసి నామినేషన్లలో తిరస్కరించబడిన నామినేషన్ లకు సంబంధించి,25న జిల్లా కలెక్టరేట్ లో అప్పీలు చేసుకునే అవకాశం కల్పించామని, ఇందులో భాగంగా తొట్టంబేడు మండల జెడ్ పి టి సి అభ్యర్థులు మణిబాబు పోతుగుంట, పెనగడం గురవయ్య మరియు పాకాల జెడ్ పి టి సి అభ్యర్థి ఎస్.స్వర్ణ కుమారీ లు మొత్తం ముగ్గురు అప్పీలుకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు.

## బీపీ అగ్రహారం టర్నింగ్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

### -నిత్యం వాహనాలతో ట్రాఫిక్

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీ కాళహస్తి టౌన్



బీపీ అగ్రహారం టర్నింగ్ నుండి బైపాస్ రోడ్డు వరకు నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతోంది. అసలు ఇరుకు రోడ్డు దానికి తోడు రోడ్డుపై ఇరువైపులా వాహనదారులు, దుకాణదారులు రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేయడంతో నిత్యం వాహనాల రద్దీతో జాతరను తలపిస్తోంది. టర్నింగ్ సమీపంలోనే రోడ్డుకి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు పార్కింగ్ చేస్తుండడంతో వచ్చే పోయే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఈ రోడ్డు మార్గంలో పోలీసులు వారు ట్రాఫిక్ ను నియంత్రించేవారు. ఇప్పుడు ఈ టర్నింగ్ గురించి పట్టించుకోకపోవడంతో నిత్యం వాహనాలతో రద్దీ ఏర్పడుతోంది. సాయంత్ర సమయంలో రోడ్డుపైనే వాహనాలు నిలబెట్టడంతో వచ్చే పోయే వారికి తీవ్ర అంతరాయం కలుగుతుంది. అలాగే టర్నింగ్ నుంచి బైపాస్ వరకు టిఫిన్ సెంటర్ వారు రోడ్డుపైనే కుర్చీలు,టేబుల్స్ వేయడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం, బుధవారం రోడ్లపైనే చేపలు, మాంసము దుకాణాలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా అమ్మడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు టర్నింగ్ నుంచి బైపాస్ రోడ్డు వరకు దృష్టి సారించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ శనీశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు

### స్వామివారికి శని త్రయోదశి పూజలు

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం





శనివారం శని త్రయోదశి సందర్భంగా రామచంద్రపురం మండలంలోని శనేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తుల పోటెత్తారు. శని దోషం కలిగిన భక్తులు స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం రాయల చెరువు పంచాయతీ ఛాయాపురంలో వెలిసిన శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుండి శని దోషం కలిగిన భక్తులు శనీశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహించి ఆలయ ప్రాంగణంలో హోమాలు గోపూజ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని అభయ హస్త ఆంజనేయస్వామికి ప్రత్యేక తులసిమాల తమలపాక మాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం శని త్రయోదశి సందర్భంగా అష్టమ శని, అర్ధాష్టమ శని ఏలినాటి శని, మహా దశలోని అరిష్ట బుక్తులు శని త్రయోదశి నాడు శనీశ్వర స్వామి తైలాభిషేకం తో పాటు హోమాలు చేపడితే శని దోషం తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు-కమిషనర్ జయకృష్ణ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను 26వ తేదీ నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల సందర్భంగా రద్దు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల వలన సోమవారం పి.జి.ఆర్.ఎస్. రద్దు చేశామని కావున ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని తెలిపారు.

# ఐదేళ్ల భవిష్యత్తు.. ఓటరు చేతిలో ఒక్క ఓటు!

## రాజవొమ్మంగి జడ్పీటీసీ బరిలో ముగ్గురు.. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వంపైనే చర్చ





రాజవొమ్మంగి: ప్రజా భూమి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీ నుంచి కొంగర మురళీకృష్ణ, సీపీఎం నుంచి లోతా రామారావు, కూటమి తరఫున మఠం విజయభాస్కర్ నామినేషన్లు దాఖలు చేయడంతో పోటీపై ఆసక్తి నెలకొంది. అభ్యర్థులు ప్రజల మద్దతు కోరేందుకు సిద్ధమవుతున్న వేళ.. ఓటర్లు మాత్రం తమకు ఎలాంటి నాయకత్వం అవసరమో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

**అవసరంలో స్పందించే నాయకుడెవరు?**

ప్రజాప్రతినిధి అంటే ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే వ్యక్తి మాత్రమే కాదు. ప్రజలకు సమస్య ఎదురైనప్పుడు వారి మాట వినడం, పరిష్కారం కోసం ప్రయత్నించడం, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం కూడా బాధ్యతలో భాగమే. ఫోన్ చేసిన వెంటనే స్పందించడం సాధ్యం కాని పరిస్థితులు ఉండవచ్చు. అయితే తర్వాత తిరిగి సంప్రదించి సమస్య తెలుసుకుంటారా? ప్రజలకు సమయం కేటాయిస్తారా? పరిష్కారం కోసం చొరవ చూపుతారా? అన్నది నాయకత్వాన్ని అంచనా వేయడంలో ముఖ్యమైన అంశం.

**గతంలో ఏం చేశారు.. ఇకపై ఏం చేస్తారు?**

ఓటు వేయడానికి ముందు అభ్యర్థుల గత పనితీరును పరిశీలించడం అవసరం. ఇప్పటికే ప్రజాజీవితంలో ఉన్న నాయకులు ప్రజల కోసం చేసిన పనులు ఏమిటి? గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఇచ్చిన హామీల అమలు పరిస్థితి ఏమిటి? కొత్తగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికతో ముందుకొస్తున్నారు? అన్న విషయాలను ఓటర్లు తెలుసుకోవాలి. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై అభ్యర్థుల వైఖరి ఏమిటో ప్రజలు ప్రశ్నించాలి. హామీలకే పరిమితం కాకుండా, చేయగలిగిన పనులపై స్పష్టత ఇచ్చే నాయకత్వం అవసరం.

**ఓటు ఒక్కరోజు.. బాధ్యత ఐదేళ్లు!**

ఎన్నికల రోజు వేసే ఓటు ప్రభావం ఒక్కరోజుతో ముగియదు. ఎన్నికైన ప్రజాప్రతినిధి తన పదవీకాలంలో ప్రజల సమస్యలపై స్పందిస్తూ, అభివృద్ధి కోసం కృషి చేయాల్సి ఉంటుంది. అందుకే తాత్కాలిక ఆకర్షణలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా, అభ్యర్థుల గత పనితీరు, ప్రజలతో వారి సంబంధాలు, భవిష్యత్తు కార్యాచరణను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం ముఖ్యం. రాజవొమ్మంగి జడ్పీటీసీ ఎన్నికలో ఎవరు ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటారు? ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఎలాంటి కార్యాచరణతో ముందుకొస్తారు? గ్రామాల అభివృద్ధికి తమ ప్రణాళిక ఏమిటో ప్రజలకు వివరిస్తారా? అన్న ప్రశ్నలకు అభ్యర్థులు తమ ప్రచారంలో సమాధానాలు చెప్పాల్సి ఉంది. పార్టీ ఏదైనా, అభ్యర్థి ఎవరైనా ప్రజా సమస్యలపై బాధ్యతగా స్పందించడం, ప్రజలకు అందుబాటులో ఉండటం, అభివృద్ధి కోసం కృషి చేయడం ప్రజాప్రతినిధుల నుంచి ప్రజలు ఆశించే ప్రధాన లక్షణాలు. అభ్యర్థుల మాటలు, గత పనులు, భవిష్యత్తు ప్రణాళికలను బేరీజు వేసుకుని ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అభ్యర్థుల హామీలు, ఎన్నికైన ప్రతినిధుల పనితీరుపై ప్రజాభూ మి ఎప్పటికప్పుడు వాస్తవాల ఆధారంగా కథనాలను ప్రచురించనుంది. ప్రజలకు సంబంధించిన అంశా లను ప్రజల ముందుంచడం, అభివృద్ధిపై చర్చకు వేదిక కల్పించడం పత్రిక బాధ్యతగా కొనసాగనుంది.

# 375 నామినేషన్లు.. అసలు లెక్క 27న!

### పార్టీల వ్యూహాలపై ఆసక్తి..

### చివరి వరకు బరిలో నిలిచేదెందరు?

ప్రజా భూమి రాజవొమ్మంగి

పోలవరం జిల్లాలో పరిషత్ ఎన్నికలకు 375 నామినేషన్లు దాఖలయ్యాయి. 101 ఎంపీటీసీ స్థానాలకు 266, 12 జడ్పీటీసీ స్థానాలకు 109 నామినేషన్లు నమోదయ్యాయి. నామినేషన్ల దాఖలు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఉపసంహరణలపై పడింది.నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులందరూ చివరి వరకు పోటీలో ఉంటారా? లేక రాజకీయ పార్టీల మధ్య జరిగే సంప్రదింపులు, అభ్యర్థుల వ్యక్తిగత నిర్ణయాలు తుది బరిలో మార్పులు తీసుకొస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల తదుపరి అడుగులపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఎవరెవరు ఉపసంహరించుకుంటారనే దానిపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదు.

**పార్టీ వ్యూహమా.. అభ్యర్థి పట్టుదలా?**

ఎన్నికల్లో పోటీకి సిద్ధమై నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు చివరి వరకు తమ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? పార్టీ నాయకత్వం సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఉపసంహరణల సమయంలో తీసుకునే నిర్ణయాలు కొన్ని స్థానాల్లో పోటీ స్వరూపాన్ని మార్చే అవకాశం ఉంది. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో ఉపసంహరణ గడువు ముగియనుంది. ఆ తర్వాతే తుది బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత వస్తుంది. నామినేషన్ల సంఖ్య రాజకీయ ఆసక్తిని చూపిస్తే.. తుది బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య పార్టీల వ్యూహాలను, అభ్యర్థుల పట్టుదలను వెల్లడించనుంది. అసలు లెక్క తేలేది ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాతే.

# స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లలో పటిష్ట ఏర్పాట్లు

### ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వొద్దు

### - : కలెక్టర్ మహేష్ కుమార్.



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్ల లో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ రావిరాల మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తపేట డివిజన్ పరిధిలోని స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లలో చేపడుతున్న ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేటలోని వి.కె.వి. డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ హాళ్లలో అవసరమైన సౌకర్యాలు, ఇతర మౌలిక ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఆర్డీవో సత్యనారాయణ, డీఎస్పీ సుంకర మురళీమోహన్ తదితర అధికారులు ఉన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థల బోధకులు కూడా టీచర్స్ ఎం.ఎల్.సి ఓటరుగా నమోదు చేసుకోండి

### ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్, రాష్ట్ర అధ్యక్షురాలు- డి. ప్రసన్న



ప్రజాభూమి ప్రతినిధి , మచిలీపట్నం:

ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న బోధకుల కోసం టీచర్స్ ఎం.ఎల్.సి ఓటర్ల ఎన్రోల్మెంట్ హెల్ప్ లైన్ సెంటర్ ను ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (గ్రూఫీ) ఏర్పాటు చేసింది. సి.వి. రామన్ అకాడమీ, జిల్లా కోర్టు సమీపం, ఎన్.జి.ఓ హోమ్ ప్రక్క సందు, మచిలీపట్నంలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు.కృష్ణా - గుంటూరు జిల్లాల టీచర్స్ ఎం.ఎల్.సి ఓటర్లు ప్రతి రోజు సాయంత్రం 6 గం. నుండి 9 గం. వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా డి. ప్రసన్న, సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఓటు వేసిన వారు కూడా ఇప్పుడు కొత్తగా నమోదు చేసుకోవాలి. పాత లిస్ట్ వర్తించదు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ హైస్కూల్స్, కాలేజీలు, టెక్నికల్, ట్రెడిషనల్, ఒకేషనల్ కాలేజీల్లో పనిచేసే వారు అర్హులన్నారు.కాగిత శంకర సాంబశివరావు రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల ఎన్నో ఉద్యమాల ఫలితంగా ఈ ఓటు హక్కు రావడం చారిత్రాత్మకం. భారతదేశంలో ఏ వృత్తికి లేని ప్రత్యేక అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే రాజ్యాంగం కల్పించిందన్నారు. బొక్కా అయ్యప్ప స్వామి రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఎన్రోల్మెంట్ లో వచ్చే ప్రతి సందేహాన్ని నివృత్తి చేయడంతో పాటు, ప్రైవేట్ సంస్థల నుండి అవసరమైన పత్రాలు పొందడానికి సహకారం అందిస్తామన్నారు. కూరేటి జగన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన హక్కులు పొందడానికి ప్రతి అర్హత గల ప్రైవేట్ టీచర్ తప్పక నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి, అబ్బాస్, పి.రాము, కేదారనాథ్, జనార్ధన్, విజయ్, గీతాంజలి, అరుణ, మాధవి, భాగ్యలక్ష్మి, ఏంజెల్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నార్పల 3వ ఎంపీటీసీ అభ్యర్థి స్వాతి లతా రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభం

### పెద్దమ్మ తల్లి దర్శనం అనంతరం ఇంటింటా ప్రచారం..

### ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన



ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలోని 3వ ఎంపీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి స్వాతి లతా రెడ్డి పులసలనూతల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకుని, అమ్మవారి ఆశీస్సులతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు, అవ్వాతాతలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ప్రచారం కొనసాగించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్ యాదవ్, అమర్నాథ్ రెడ్డి, రమేష్, రాము, రామచంద్ర, జానుగాని శివశంకర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, నాయకులు వేదాంత మోహన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మవరం గ్రామ జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం,తిమ్మవరం గ్రామ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో గుమ్మడి బాలకృష్ణయ్య, శేఖర్ యాదవ్, చెంచయ్య నాయుడు, రఘు నాయుడు, నాగరాజు రెడ్డి,సురేంద్ర యాదవ్, శివ రాయల్, మస్తాన్ యాదవ్, నరేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు,మోడీ రాజా యాదవ్, సుబ్రమణ్యం, శివ కృష్ణ,జయ చంద్ర,బాల కృష్ణ,శివ,కోటి, సుబ్బరాయలు, మణి, చిరంజీవులు యాదవ్, శంకర్ రాయల్, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజారులో ధరణి రైస్ విక్రయాలపై తనిఖీ

### ఆధార్‌తో సబ్సిడీ ధరకు బియ్యం పొందవచ్చు: అరిగెల బలరామమూర్తి.



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట:

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో ధరణి రైస్‌ను సబ్సిడీ ధరకు విక్రయిస్తున్నారా లేదా అనే అంశంపై రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు అరిగెల బలరామమూర్తి ఆదివారం కొత్తపేట రైతు బజారులో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం విక్రయాలు, ధరలు, వినియోగదారులకు అందుతున్న సబ్సిడీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతు బజారులో ధరణి రైస్‌ను 26 కిలోల బస్తాను రూ.1,250కు, అంటే కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు కొనుగోలుదారులు తెలిపారు. ప్రతిరోజూ సుమారు రూ.2,000 విలువైన ధరణి రైస్‌ను విక్రయిస్తున్నట్లు బజారు నిర్వాహకులు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అరిగెల బలరామమూర్తి మాట్లాడుతూ, కొత్తపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు బజారుకు వెళ్లి ఆధార్ కార్డు ద్వారా సబ్సిడీ ధరకు ధరణి రైస్‌ను పొందవచ్చని తెలిపారు. సబ్సిడీ బియ్యం అర్హులైన వినియోగదారులకు అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీలో కొత్తపేట వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు ఉషారాణి, గుబ్బల మూర్తి, బెహరా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కన్నాపురం నుంచి నవ్యశ్రీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



ప్రజాభూమి ఏలూరు.జిల్లా పెదవేగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థి చింతమనేని సాయి నవ్యశ్రీ ఆదివారం కన్నాపురం గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ,తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరికీ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.నవ్యశ్రీకి గ్రామ మహిళలు మంగళహారతులు పట్టి, దిష్టి తీసి ఆత్మీయ స్వాగతం పలికారు.ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఉన్న అభిమానాన్ని ఆయన కుమార్తె నవ్యశ్రీపై చూపిస్తూ ప్రజలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏఎంసీ మార్కెట్ చైర్‌పర్సన్ గారపాటి రామసీత, మండల పార్టీ అధ్యక్షుడు ఈడుపుగంటి అనిల్‌తో పాటు కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## రేణిగుంట సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

పూడి రైల్వే స్టేషన్ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్ వైపు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ముందు అందిన రైల్వే సమాచారం మేరకు, పూడి-- రేణిగుంట రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 132/ 4-6 వద్ద పట్టాల కుడివైపున మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, గుర్తుతెలియని రైలు నుంచి జారిపడటం లేదా ప్రమాదానికి గురికావడం వల్ల తీవ్ర గాయాలై మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి తల నుదుటిపై గాయం ఉండగా, కుడిచేయి తీవ్రంగా దెబ్బతింది. ఎడమ మణికట్టు, కుడి చీలమండ వద్ద కూడా తీవ్ర గాయాలు ఉన్నట్లు సమాచారం. శరీరంపై అక్కడక్కడ గోకుడు గాయాలు కనిపించాయి. మృతుడు నీలం రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, నీలం రంగు లోదుస్తులు, ఆరెంజ్ రంగు పంచె ధరించి ఉన్నాడు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు కలిగి, నలుపు-తెలుపు జుట్టుతో పాటు తెల్లని గడ్డం ఉన్నట్లు గుర్తించారు. వీపు మధ్యభాగంలో, ఎడమ తొడపై నల్లని పుట్టుమచ్చలు ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు లేదా కుటుంబ సభ్యులు గుర్తించగలిగే వారు సంబంధిత రైల్వే జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్‌రావుకు సంప్రదించాలని సూచించారు.

## శివనామస్మరణలతో మార్మోగిన ముక్కోటి ఆలయం..!

### నందివాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు..

### వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన భక్తులు..



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

తొండవాడలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం ముక్కోటి పర్వదినం సందర్భంగా ఆలయ ఆవరణములో శివనామస్మరణలతో మార్మోగింది. శ్రీ ఆనందవల్లీ దేవి సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామివారు నందివాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. జోరువర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ అగస్త్య మహాముని, లోపముద్రా దేవి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ ఆనందవల్లీ దేవి సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి దివ్య మండపం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు మొగిలి ఇందుమౌళి రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న ముక్కోటి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్ల నందివాహన సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన పరదాల మణి తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానానికి పరదాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు మొగిలి ఇందుమౌళి రెడ్డికి పరదాలను అందజేశారు. స్వామివారి సేవలో భాగంగా పరదాలను సమర్పించడం పట్ల ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# నార్పల మండల వ్యాప్తంగా 16 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి ప్రచార జోరు

### అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల విస్తృత ప్రచారం

ప్రజా భూమి నార్పల

నార్పల మండల వ్యాప్తంగా మొత్తం 16 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్నారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి ఎంపీటీసీ స్థానంలోనూ కూటమి బలాన్ని చాటాలనే లక్ష్యంతో నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. మండల వ్యాప్తంగా 16 ఎంపీటీసీ స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తుండటంతో నార్పల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది.

## కరిమలరత్నం ఆచారి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని దర్గా మిట్టకు చెందిన కరిమలరత్నం ఆచారి ఆకస్మిక మృతి చెందారు కావున నేడు వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మున్నా రాయల్,రవి,కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి,పగడాల రాజు,ప్రసాద్ మేస్త్రి,మధురెడ్డి,సుబ్రహ్మణ్యం , ఢిల్లీ,ఆర్కాడు శంకర్,ముని కృష్ణారెడ్డి,సుబ్రహ్మణ్యం ఆచారి, శ్రీనివాసులు ఆచారి,నాగేశ్వర్ రెడ్డి ,సతీష్,శ్రీనివాసులు రెడ్డి, మునేంద్ర యాదవ్,షేక్ బాబు, నాగ,చిరంజీవి,షేక్ హమీద్,శ్రీనివాసులు రెడ్డి,మస్తాన్,వసంత రాజు,పాండు,బద్రి, హనుమంతు, రఘు ,ప్రశాంత్,గణేష్ ,యాకూబ్, శివ, హేమంత్, రవి, చైతు,సాగర్, నజీర్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

సోమవారం,అక్టోబర్ 26 ,2026

జనరల్ 12

# చంద్రబాబు బ్లాక్ మెయిలింగ్, ఉడత ఊపులకు బెదిరేది లేదు

**వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి  కాకాణి గోవర్ధన్ రెడకాకాణి గోవర్ధన్ రెడ్డి**

**ప్రజాభూమి ప్రతినిదినెల్లూరు**

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక, వెల్లువలా వస్తున్న ప్రజావ్యతిరేకతకు భయపడి స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు వరుసగా దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని, తాజాగా ఫేక్ నామినేషన్లు, నామినేషన్ల తిరస్కరణలు, ఆమోదించి నామినేషన్ల విత్ డ్రాకు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి  కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫైర్ అయ్యారు.చంద్రబాబు ఎన్ని అక్రమాలకు పాల్పడినా, జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన గుండె ధైర్యంతో వైఎస్సార్సీపీ అభ్యర్ధులు వీరోచితంగా పోరాడుతున్నారని ఆయన కితాబిచ్చారు. చంద్రబాబు బ్లాక్ మెయిలింగ్ కూ, ఉడత ఊపులకూ బెదిరేది లేదని, ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు.రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై వైఎస్సార్సీపీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదులు చేయడం, పట్టించుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ తూతూమంత్రంగా నాలుగు చోట్ల మాత్రం నామినేషన్ల గడువు పొడిగించింది. ఆ తర్వాత రెండో ఘట్టంలో భాగంగా సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇవ్వడం, చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుబట్టడం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ దీని మీద సమీక్షించాలని ఇచ్చాక చంద్రబాబుకు ఏమాత్రమైనా నీతి నిజాయితీ ఉంటే రాజీనామా చేయాల్సింది. ఇంత అనుభవజ్ఞుడని చెప్పుకునే చంద్రబాబు.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అంటేనే ఏహ్యాభావం కలిగేలా, రాష్ట్రం పరువుకు తీవ్ర నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తీరు కొనసాగిస్తే మళ్లీ సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టేలా ఉందని తెలిసి మరో కుట్రకు తెరలేపారు. ఈ ఎన్నికల్లో అయినా చంద్రబాబు సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని వ్యవహరిస్తాడని అనుకుంటే అదీ జరగడం లేదు. దీనికి బదులుగా టీడీపీ అభ్యర్ధులతో నామినేషన్లు వేయించడం, వైఎస్సార్సీపీ అభ్యర్ధుల్ని అడ్డుకోవడం, టీడీపీకి సంబంధించిన వ్యక్తుల చేతే వైఎస్సార్సీపీ నామినేషన్లు కూడా వేయిస్తున్నారు. రేపు ఒకవేళ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించినా, లేదు అంతా న్యాయబద్దంగా జరిగింది, నామినేషన్లు సక్రమంగానే దాఖలయ్యాయని  చెప్పుకునేందుకు కుట్ర మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే ఫేక్ నామినేషన్లను ఆధారాలతో సహా మేం బయటపెడుతున్నాం. వైఎస్సార్సీపీ తమ అభ్యర్ధులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని చెప్పుకోకుండా ఉండేందుకు, నామినేషన్లు వేసిన వ్యక్తులు పోటీలో పాల్గొనకుండా చేసి, వారంతా ఓటు అడగకుండా చేసి, ఏకగ్రీవంగా గెలిచినట్లు చూపించుకునేందుకే ఇదంతా చేస్తున్నారు. ఎన్ని విధాలుగా కుట్రలు, దొంగతనాలకు పాల్పడాలో అన్నీ తెలిసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన జీవితంలో ఎక్కడా నీతి, నిజాయితీ కనిపించవు. అందుకే ఫేక్ నామినేషన్లు వేయించి, దొంగ లెక్కలు, కాకి లెక్కలతో ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చేస్తున్నారు. మొదటిది  దాడులు చేసి నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, రెండవది సుప్రీంకోర్టు తీర్పు తర్వాత నామినేషన్లు వేయలేదనే అంశాన్ని అధిగమించడానికి తన మనుషులతో దొంగనామినేషన్లు వేయించడం, మూడవది కొంత మంది ఎదురుతిరిగి నామినేషన్లు వేసిన వాళ్ల నామినేషన్లను తిరస్కరించడం. నెల్లూరు జిల్లాల్లోనూ ఇలాగే రిటర్నింగ్ అధికారులు ఏమాత్రం నీతీ నిజాయితీలు లేకుండా, అన్నీ విడిచిపెట్టి, అక్కడున్న టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల మాటల్ని వేదంలా భావించి, వారి స్వామి భక్తిని చాటుకున్నారు. ప్రజాస్వామ్య విలువలకూ, రాజ్యాంగ నిబంధనలకు పాతరేస్తూ ఆర్వోలు వ్యవహరిస్తున్నారు. ఏదో విధంగా బలమైన అభ్యర్ధుల్ని, వైఎస్సార్సీపీ తరఫున గెలుస్తారని అనుకున్న వారి నామినేషన్లను తిరస్కరిస్తున్నారు. వెంటనే అప్పీలుకు వెళ్తారు కాబట్టి తిరస్కరణకు గురైన నామినేషన్లు ఆమోదించకుండా ఆర్డీవోలపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల ఆర్వోలు ఆమోదించిన నామినేషన్లను సైతం తిరస్కరించాలంటూ ఆర్డీవోలకు అప్పీల్లు పెడుతున్నారు. వృత్తి పేరు రాయలేదని ఒకరి నామినేషన్, పెళ్లి కాకపోయినా భార్య ఆస్తులు డిక్లేర్ చేయలేదంటూ మరో నామినేషన్ తిరస్కరించారు. పెళ్లే కాని వ్యక్తికి భార్య ఎక్కడి నుంచి వస్తుంది చంద్రబాబూ. మా లీగల్ టీమ్ వెళ్లి అభ్యంతరాలు చెప్పినా, మీరు చెప్పాల్సిన  అవసరం లేదు, రాతపూర్వకంగా ఇచ్చి వెళ్లాలని ఆర్వోలు చెప్పేస్తున్నారు. నామినేషన్ తిరస్కరించినట్లు కొన్ని చోట్ల లేఖలు ఇచ్చారు, మరికొన్ని చోట్ల అది కూడా ఇవ్వడం లేదు. ఏ కారణంతో తిరస్కరించారో చెప్పాలని మా అభ్యర్ధులు ఆర్వోల దగ్గర అప్పీలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.ఎన్నికలకు ముందే చంద్రబాబు అనేక హామీలు ఇచ్చాడు. వాటిని అమలు చేయలేని పరిస్థితుల్లో ఆయన ఉన్నాడు. కాబట్టి ప్రజలు భగ్గు మంటున్నారు, ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భయం వారికి ఉంది. చంద్రబాబు ఇవాళ ఓటమిపాలైతే రేపు అధికారులు ఆయన మాట వినరు కాబట్టి, ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా ఏదో విధంగా గెలిచామనే సందేశం ఇస్తే తప్ప గట్టెక్కలేమనే అక్రమాలకు దిగుతున్నారు. గంజాయి బ్యాచ్ ను కూడా రంగంలోకి దింపి, వాళ్లను కొట్టండి, చంపండి కానీ వాళ్లు నామినేషన్ వేయడానికి లేదని చెప్తున్నారు.  నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలో ఆర్డీవో.. ఇన్ కంప్లీట్ అని నామినేషన్ తిరస్కరించారు, మీడియా అడిగినా సమాధానం చెప్పలేదు.  వైఎస్సార్సీపీ వేసిన నామినేషన్లను రెండో రోజు టీడీపీ ఆఫీసుకు తీసుకెళ్లి ఇచ్చి, వాటిలో తప్పులు వెతకమని చెప్పడం, వాళ్లు చెప్పిన తప్పుల ఆధారంగా వాటిని తిరస్కరిస్తున్నారు. రేషన్ షాపు నడిపే వాళ్లు, వాటిని ఎప్పుడో తీసేసినా, గతంలో రేషన్ షాపు ఉంది కాబట్టి నామినేషన్ తిరస్కరించామని చెప్తున్నారు. అంగన్ టీచర్లు సైతం రాజీనామాలు చేసినా, ఇంకా పనిచేస్తున్నట్లుగానో, రికవరీలు ఉన్నాయని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేసిన వాళ్లను సైతం మీ మీద రికవరీ వచ్చిందని డీఆర్డీఏ నుంచి సమాచారం వచ్చిందని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. డ్వాక్రా మహిళలు లోన్లు తీసుకుంటే, ఏపీఎం దగ్గరో, సీసీ దగ్గరో కాయితం రాయించి ఈమె ఆ గ్రూపులో ఉంది, ఆ గ్రూపుకు సంబంధించిన లోను ఆమె చూపించలేదు అని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. దీన్ని బట్టి ఎన్నికలకు చంద్రబాబు ఎంత భయపడుతున్నాడో అర్ధమవుతోంది. సాధారణ ఎన్నికల్లో ప్రజల ఓట్లతో గెలిచిన చంద్రబాబు.. అదే ప్రజల ఓటు హక్కు హరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు మర్చిపోరని గుర్తించాలి. రాష్ట్ర ప్రజలు కీలెరిగి వాతలు పెడతారని తెలుసుకోవాలి. ఎన్నికల్లో పోటీ చేసే సత్తా లేదు, శక్తి లేదు, దమ్మూ ధైర్యం లేదు, అటువంటప్పుడు నామినేట్ చేసుకుంటే సరిపోయేది తప్ప,  ఎన్నికల్లో నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకుని, దొంగ నామినేషన్లు వేయించి, నామినేషన్లను తిరస్కరించి దాన్ని గెలుపుగా చెప్పుకుంటారా? ఆ గెలుపును గెలుపుగా ప్రజలు అనుకుంటారా, దాన్నే గెలుపుగా అనుకునే స్థాయికి చంద్రబాబు దిగజారిపోయారా చెప్పాలి.చంద్రబాబు డైరెక్షన్ ఆధారంగా ఆయన కింద ఉన్న  డీజీపీ, డీఐజీలు, ఐజీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు వ్యవహరిస్తున్నారు. దాని ప్రకారం రిటర్నింగ్ అధికారి యాక్షన్ చేస్తున్నారు. ఫలితంగా మొత్తం ఎన్నికల ప్రక్రియనే ఓ ప్రహసనంగా మార్చేసి, అభ్యర్ధులు పోటీ చేయకూడదు, ప్రజలు ఓటేయకూడదు, నేను చెప్పిన వ్యక్తే ఈరోజు ఎన్నిక కావాలనే దుర్మార్గమైన ఆలోచన కనిపిస్తోంది. ఎక్కడైనా ఆర్వోలు ఒకరిద్దరు గట్టిగా నిలబడి, తమ ఆత్మసాక్షి ప్రకారం నామినేషన్లు ఆమోదిస్తే, సదరు అభ్యర్ధులకు ఫోన్లు చేసి కేసులు బనాయిస్తామని, కుటుంబ సభ్యుల్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు. కొంతమంది గిరిజనుల్ని బెదిరించి పోలీసు స్టేషన్లో పెట్టడం, విత్ డ్రా ఫారాలు తీసుకొచ్చి సంతకాలు చేయండి, మీ మీద కేసు లేకుండా చేస్తామని చెప్తున్నారు. ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళ్లింది, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడికి పోయాయో తెలియట్లేదు. దళితుల్ని, గిరిజనుల్ని సైతం పోలీసు స్టేషన్లను తీసుకొచ్చి కేసులు పెడతామని బెదిరించి నామినేషన్లను విత్ డ్రా చేయిస్తున్నారు. చంద్రబాబు ప్రెస్ మీట్ పెట్టి చెప్పిన మాటలు ప్రజలకు అసహ్యం కలిగించేలా ఉన్నాయి. తన బురదను తిరిగి జగన్మోహన్ రెడ్డి గారికి పూసేందుకు ప్రయత్నిస్తున్నారు. గూడూరులో మరో నాయకుడు యద్దాల నరేందర్ రెడ్డి ఇంట్లోకి 25 మంది పోలీసులు గోడలు దూకి వెళ్లి సోదాలు చేశారు. ఆయన్ను అడ్డుతొలగించుకుంటే గూడూరులో సులువుగా ఎన్నికలు జరిగిపోతాయని ఇలా చేశారు. మరో సీనియర్ నాయకుడు భక్తవత్సల రెడ్డి మీద అక్రమంగా 307 కేసు పెట్టి గాలిస్తున్నారు. మరో నాయకుడు శ్రీనివాసులరెడ్డిని అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. మీరు నామినేషన్లు వేస్తే జైలుకు పోవడానికి సిద్దంగా ఉండండి, అంతే తప్ప మీ నామినేషన్లు ఒప్పుకోం, ఒక వేళ నామినేషన్ వేసినా ఉపసంహరించుకుంటారా లేక జైలుకు పోతారా అని బెదిరిస్తున్నారు. దళితులు,  వెనుక బడిన వర్గాలని, ముస్లింలని చూడకుండా వైఎస్సార్సీపీ అభ్యర్ధుల్ని టార్గెట్ చేస్తున్నారు. చంద్రబాబు డైరెక్షన్ లోనే మొత్తం తతంగం జరుగుతోంది. ఎక్కడికక్కడ గంజాయి బ్యాచ్ లు, సంఘవిద్రోహక శక్తుల్ని రంగంలోకి దింపి మహిళల బట్టలు చింపేయడం, దాడులు చేస్తున్నారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడేందుకు కాదు, టీడీపీ, కూటమి పెద్దలు చెప్పినట్లు నడుచుకోవడానికే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులే దగ్గరుండి దాడులు చేయిస్తుంటే సామాన్యులకు ఈ వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లుతోంది. జగన్మోహన్ రెడ్డి గారు అధికారంలో ఉండగా చంద్రబాబు..ఈ ఎన్నికలు నా వల్ల కావని కాడి కింద పడేసి వెళ్లిపోయారు. కానీ ఇవాళ విపక్షంలో ఉండి జగన్మోహన్ రెడ్డి గారి పిలుపుకు స్పందించి నామినేషన్లు వేసేందుకు ముందుకొచ్చి పోరాటం చేస్తుంటే, దాన్ని తట్టుకోలేకపోతున్నారు.  కాబట్టి ప్రతీ ఒక్కరికీ పోటీ చేసే, ఓటు వేసే హక్కు కల్పించాలని న్యాయపోరాటం చేస్తాం. మీ బ్లాక్ మెయిలింగ్ కు, ఉడత బెదిరింపులకు భయపడేది లేదు. అక్రమాలకు అండగా నిలిచిన పోలీసులపై ప్రైవేటు కేసులు వేయబోతున్నాం. వాటి ఆధారంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

# పరాకాష్టకు చంద్రబాబు కుటిల రాజకీయాలు

**కోర్టుల్ని, ప్రజల్ని మభ్యపెట్టేందుకే ఫేక్ నామినేషన్లు**

**చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదు**

**ఫేక్ నామినేషన్లతో ఎంతకాలం మభ్యపెడతారు?**

**దాడులతో ఎన్నికలు గెలిచి ఏం సాధిస్తారు?**

**జగన్ కూడా ఇలాగే చేసి ఉంటే మీరెక్కడ ఉండేవారు?**

**స్థానిక ఎన్నికలు సక్రమంగా జరిగితే ప్రజలకు మేలు**

**ఎన్నికల్ని ఫార్సుగా మార్చేస్తున్న చంద్రబాబు**

**దీనికి బదులు ఆయనే నామినేట్ చేసుకోవాల్సింది**

**బరితెగింపు అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సిందే**

**: రవీంద్రనాథ్ రెడ్డి వార్నింగ్**

**ప్రజాభూమిప్రతినిధికడప:**

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను భయపెట్టి గెలవాలని చంద్రబాబు చూస్తున్నారని, నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డగింతలు, దాడులు, దౌర్జన్యాలు,  చివరికి ఫేక్ నామినేషన్లతో బరి తెగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. జగన్ కూడా ఇలాగే చేసి ఉంటే మీరు ఎక్కడ ఉండే వారని ఆయన చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల మాటలు విని దాడులకు, అక్రమాలకు సహకరిస్తున్న అధికారులు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని రవీంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. ప్రెస్ మీట్లో రవీంద్ర నాథ్ రెడ్డి ఇంకేమన్నారంటే..:చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత ఉందా అసలు ? ఆయన జీవిత చరమాంకంలో ఉన్నారు. గతంలో ప్రజలకు మంచి చేయకపోయినా, ఏ ప్రాంతానికీ మంచి చేయకపోయినా, ఏ కులానికి మంచి చేయకపోయినా, ఏ వ్యక్తికి మంచి చేయకపోయినా.. ఇప్పుడు చేస్తున్న పాలన అంతకన్నా దుర్మార్గంగా ఉంది. నీ రాజకీయమే వెన్నుపోటు నుంచి ప్రారంభమై క్లైమాక్స్ లో పరాకాష్టకు చేరిపోయింది. సుప్రీంకోర్టు, హైకోర్టులు మొట్టికాయలు వేసినా చంద్రబాబుకు బుద్ధి రావడం లేదు. యథేచ్ఛగా మీ గూండాలు రాయలసీమ జిల్లాలతో పాటు పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో  దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అయినా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అయినా నామినేషన్లు వేయనీయడం లేదు.  అధికారులు ముందే సాగిలపడుతున్నారు. అధికారుల ముందే అంతా జరుగుతున్నా వాళ్లు పట్టించుకోలేదు. నామినేషన్ పత్రాలు చించేయడం, మహిళలను సైతం లెక్కచేయకుండా దాడులు చేయడం, ఎవర్నీ వీళ్లు వదలడం లేదు. నామినేషన్లు లేకుండా చేసే కార్యక్రమం చేస్తున్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం ? దీన్ని అసలు రాజకీయం అంటారా ? మేం అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి గారు కూడా ఇలాగే అనుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో తెలుసుకోండి. మంచి చేశాకే ప్రజల్ని ఓట్లడగాలని జగన్మోహన్ రెడ్డి గారు అనుకోవడం వల్లే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి. ఎక్కడ చూసినా 80-90 శాతం పైగా ఓటింగ్ జరిగింది, ఫలితాలు కూడా అలాగే వచ్చాయి. దీనంతటికీ కారణంగా జగన్మోహన్ రెడ్డి గారి సుపరిపాలనే. సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఈవీఎంల వల్లే ఓడిపోయాం కానీ, ఎన్నికలు పారదర్శకంగా జరిగి ఉంటే కచ్చితంగా మరోసారి జగన్మోహన్ రెడ్డి గారు మరోసారి ముఖ్యమంత్రి అయ్యేవారు.ఇప్పుడు వైఎస్సార్సీపీ అభ్యర్ధులకు డూప్లికేట్లు తయారు చేసి టీడీపీ వాళ్లతో ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా నామినేషన్లు వేయిస్తున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించామని కోర్టుల్ని, ప్రజాస్వామ్యవాదుల్ని మభ్యపెట్టడానికే ఇదంతా చేస్తున్నారు. రామకుప్పం మండలం టీడీపీ నాయకుడు శంకరప్ప వైఎస్సార్సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు, అలాగే నీ సొంత నియోజకవర్గం కుప్పంలోని జీడిమాకుల పల్లె, సింగసముద్రం సెగ్మెంట్ లో తన భార్య పుష్పమ్మ పేరుతో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా దొంగ నామినేషన్ వేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. నామినేషన్ల మొదటిరోజు ఎంపీటీసీలకు సంబంధించి 5267 నామినేషన్లు వైఎస్సార్సీపీ వేస్తే.. రెండో రోజు కల్లా వాటిని 26,856కు పెంచేశారు. ఇదంతా కోర్టుల్ని మభ్యపెట్టడానికి, ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికే. మూడో రోజు కల్లా 25,016 ఎంపీటీసీ నామినేషన్లు వేశారు. జడ్పీటీసీలు కూడా తొలిరోజు వైఎస్సార్సీపీ పేరు మీద 409 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.  రెండో రోజు 2409 నామినేషన్లు, మూడో రోజు 3515 నామినేషన్లు వైఎస్సార్సీపీ తరఫున ఫేక్ నామినేషన్లు వేశారు.  వీళ్లంతా వైఎస్సార్సీపీ కాదని విత్ డ్రా తర్వాత, బీ ఫామ్ ఇచ్చాక ప్రజలకు తెలుస్తుంది. అంతవరకూ వీళ్లు ప్రజల్ని మభ్యపెట్టవచ్చు. కడపలో 14 జడ్పీటీసీల్లో ఫేక్ నామినేషన్లు వేశారు. దాఖలైన 39 నామినేషన్లలో ఇప్పుడు ఆమోదించినవి చూస్తే 21 మాత్రమే. మిగతావన్నీ తిరస్కరించారు. 39 నామినేషన్లలో ఓ ఆరు నామినేషన్లు పోలీసుల్ని అడ్డుపెట్టుకుని వీళ్లు చేసిన దాష్టికానికి బలైన వాళ్లే. నామినేషన్ కేంద్రాల లోపల మాత్రం వందల మంది వీళ్ల నాయకులే ఉంటారు. బయటి నుంచి మా వాళ్లు ఒక్కరిని కూడా రానివ్వరు. వేటిని తిరస్కరించాలి, వేటిని ఆమోదించాలన్నది పై నుంచి అన్నీ ఒత్తిళ్లే. స్థానిక సంస్థలకు జరిగేవి చిన్న ఎన్నికలే. ప్రజాస్వామ్యయుతంగా జరిగితే మంచి నాయకులు వచ్చి ప్రజలకు మేలు జరుగుతుంది. అలా కాకుండా మొత్తం ఎలక్షన్ ఫార్సుగా మార్చేస్తున్నారు. దీనికి బదులు మీరే నామినేట్ చేసుకుని ఉండాల్సింది. ఆంధ్రాలో వీళ్ల అరాచకాలు బీహార్ ను మించిపోయాయి.  పోలీసులు, జిల్లా అధికారులను అడ్డుపెట్టుకుని వీళ్లు పులుల్లా తిరుగుతున్నారు. మా వాళ్లను వదిలితే తెలుస్తుంది ఎవరు పులులో. తిరిగి వైఎస్సార్సీపీ వాళ్లే దాడులు చేస్తున్నారని కోర్టుల్ని, ప్రజల్ని మభ్యపెడుతున్నారు. నామినేషన్ల తిరస్కరణకు గురైన వాళ్ల తరఫున అప్పీలుకు వెళ్తున్నాం. కలెక్టర్ గారు ఏం చేస్తారో చూడాలి. ఐఏఎస్, ఐపీఎస్ లు పక్షపాతం లేకుండా అందరినీ సమానంగా చూస్తాం, అందరికీ మేలు చేస్తాం, బడుగు  బలహీన వర్గాలకు అండగా నిలబడతామని ప్రమాణం చేసి వస్తారు. కానీ అలాంటి వాళ్ల ముందే ఇవాళ బదిలీలు, సొంత పనుల కోసమో, డబ్బుల కోసమో ఇలా దిగజారిపోతున్నారు. ప్రజాప్రతినిధులు వస్తుంటారు, పోతుంటారు, కానీ అధికారులు శాశ్వతం. వాళ్లకు సుమారు 45 ఏళ్ల సర్వీసు ఉంటుంది. కానీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో వీళ్లు ఇలా బరితెగిస్తున్నారు. ఈ పనులకు వారు తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ  ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ అధికారంలోకి వస్తే సినిమా చూపించడం ఖాయం. ఇప్పటికైనా వీళ్లంతా తమ తీరు మార్చుకోవాలని రవీంద్రనాథ్ రెడ్డి హితవు పలికారు.

# అఖండ విజయం తథ్యం కావాలి!

**ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:**



మచిలీపట్నం నార్త్ మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి లంకే ఉషారాణికి గరాలదిబ్బతెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు నాని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజల ఆశయాలే మార్గంగా ముందుకు సాగుతున్న లంకే ఉషారాణికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజల ఆదరాభిమానాలతో అఖండ విజయం సాధించి, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం... ప్రజల ఆదరణే విజయానికి అసలైన పునాది!  అని, మచిలీపట్నం నార్త్ మండలంలో తెలుగుదేశం పార్టీ విజయపతాకం రెపరెపలాడాలని, లంకే ఉషారాణికి ఘనవిజయం చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు గరాలదిబ్బ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు నాని తెలిపారు.

# మచిలీపట్నంలో వైసీపీకి భారీ షాక్..

**టీడీపీలోకి 200 మందికి పైగా చేరికలు!**

**తాళ్లపాలెం మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్ టీడీపీలో చేరిక**



**ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:**

నియోజకవర్గంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తాళ్లపాలెం గ్రామంలో రెండుసార్లు సర్పంచ్‌గా, కన్వీనర్‌గా పనిచేసిన వాలిశెట్టి రవిశంకర్ తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు 200 మందికి పైగా శనివారం మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు.మంత్రి కొల్లు రవీంద్ర, తెలుగుదేశం సీనియర్ నాయకులు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సోదరుడు కొనకళ్ల జగన్నాథరావు బుల్లయ్య ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.వైసీపీలో కీలక బాధ్యతలు నిర్వహించిన వాలిశెట్టి రవిశంకర్ తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. 200 మందికి పైగా ఒకేసారి టీడీపీలో చేరడంతో మచిలీపట్నంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలినట్లయింది.

# లిబరేషన్ అభ్యర్థుల ప్రచారం.

**ప్రజా భూమి ప్రతినిధి. చాట్రాయి.**



విద్యా, వైద్యం, ఉపాధి గౌరవప్రదమైన జీవనానికై రాజకీయ, ఆర్థిక ,సామాజిక- సమానత్వాల కోసం మార్క్స్ ,భగత్ సింగ్, అంబేద్కర్ పూలే బాటపడదాం, మతోన్మాదపాసిస్టులను ఓడిద్దాం! మనువాదాన్ని ఎండగడదాం,ప్రజల కోసం నిత్యం పనిచేసే సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థులను గెలిపించుకుందామని ఆదివారం ప్రచార నిర్వహించడం జరిగింది. మండలంలోని చిత్తపూరు గ్రామ ఎంపీటీసీ కి పోటీ చేస్తున్న ఎర్ర జెండా ముద్దు బిడ్డ కామ్రేడ్ కలపాల జ్యోతిని, చాట్రాయి మండలం జెడ్పీటీసీ కి పోటీచేస్తున్న ప్రజా ఉద్యమ నేత కామ్రేడ్ దుర్గం పుల్లారావు లను మూడు నక్షత్రా ల జెండా గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించా లని కోరుకుతూ ఆదివారం చిత్తపూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు రేంజి  ఐజి, జిల్లా ఎస్పీ.

**ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.**



ఏలూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన  చేపల తూము పోలింగ్ కేంద్రం, సీఆర్ రెడ్డి కాలేజ్ స్ట్రాంగ్ రూమ్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏలూరు రేంజ్ ఐజి  జి వి జి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్.ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణను అత్యంత పకడ్బందీగా, పారదర్శక వాతావరణంలో పూర్తి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ఏర్పాట్ల లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజి జి వి జి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ  కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు లోని పలు ఎన్నికల కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఏలూరు చేపల తూము సెంటర్ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కేంద్రాన్ని ఎస్ప స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన ఎస్పీ  ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు మరియు ఆదేశాలు జారీ చేశారు. చేపల తూము సెంటర్ లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, సరైన రాకపోకల దారులు మరియు క్యూలైన్ల ఏర్పాటుపై అధికారులకు తగిన ఆదేశాలు జేశారు.సి.ఆర్.రెడ్డి కాలేజీ లోని స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించి, ఓట్ల భద్రతకు సంబంధించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన త్రివిధ భద్రతా వలయం  సీసీటీవీ నిఘా మరియు 24 గంటల ప్రత్యేక పోలీసు పహారాపై స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు. స్ట్రాంగ్ రూమ్ లు మరియు పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనధికార వ్యక్తులు లేదా వాహనాలు ప్రవేశించకుండా కఠినమైన భద్రతా ఆంక్షలు అమలు చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్ బి ఇన్స్పెక్టర్  మల్లేశ్వరరావు, ఏలూరు డి.ఎస్.పి శిరిడి శ్రావణ్ కుమార్ , ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్  ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, పోలీసు అధికారులు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# భూ వివాదం నేపథ్యంలో దాడి.. ఇద్దరిపై కేసు

**ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల**



భూ వివాదం నేపథ్యంలో ఇద్దరిపై దాడి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అష్రఫ్ అలీ తెలిపారు. అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించారు.యర్రమిల్లి శ్రీరామకృష్ణారావు (53), బొమ్మిడి వీణ భారతి భూ వివాదానికి సంబంధించి దాడికి గురైనట్లు ఫిర్యాదు అందింది. తిమ్మాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 1/2, 2లో ఉన్న 18.49 ఎకరాల భూమి విషయంలో వివాదం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 48/2026 కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్లు 109(1), 3(5) ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ కేసులో తిమ్మాపురం గ్రామానికి చెందిన సేవా రత్నరాజు (37), సేవా పెద్ద వీర్రాజు అలియాస్ బుజ్జి (48)లను నిందితులుగా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.డీఎస్పీ అష్రఫ్ అలీ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించగా, సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ వినోద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా రెవెన్యూ, ఎన్నికల అధికారులు మరియు పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఐజి  ఎస్పీ  హెచ్చరించారు.

# చర్చిలను సందర్శించి క్రైస్తవ ప్రముఖులను కలిసిన కూటమి మేయర్ అభ్యర్థి అబిదా బేగం

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో కూటమి మేయర్ అభ్యర్థి షేక్ అబిదా



బేగం ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చర్చిలను సందర్శించి క్రైస్తవ ప్రముఖులు, సంఘ పెద్దలనుఓటర్ మహాశయులను  మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు స్వాగతం పలికారు, నగరంలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించేందుకు ఆమె ప్రణాళిక రూపొందించారు.అక్టోబర్ 25, ఆదివారం నిర్వహించే ప్రచార కార్యక్రమంలో భాగంగా సుకర్లాబాద్, రైలుపేట, సాయిబాబా గుడి ప్రాంతం, ఆర్టీసీ చౌక్, అయ్యప్పగారి చౌక్, ప్రైమరీ స్కూల్ రోడ్ తదితర ప్రాంతాలను సందర్శించి ఓటర్లను కనుక్కోవడం జరిగింది.మచిలీపట్నం నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలను నేరుగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రచార కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam,  Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677